# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్

22-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 243

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## శ్రీవారికి 160 కిలోల బంగారం!

**రూ.250 కోట్ల విలువైన ఆభరణాల బహుకరణ**

**ఓ భక్తుడి భక్తి తత్పరత**

**ఈనెల 26న సీఎం చంద్రబాబు సమక్షంలో అందజేత**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఓ భక్తుడు భారీ కానుక సమర్పించేందుకు సిద్ధమయ్యారు. సుమారు 160 కిలోల

- మిగతా 2వ పేజీలో

## భవిష్యత్‌లో ప్రమాదం రాబోతోంది..

**తుపాకులు కొనుక్కోండి: రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు**

**దేశంలో హిందువుల మనుగడపై రాజాసింగ్ ఆందోళన**

**లైసెన్స్‌డ్ ఆయుధాలు సమకూర్చుకోవాలని హిందువులకు పిలుపు**

**గ్లోబల్ ముస్లిం జనాభా పెరుగుదలపై ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు**

**భవిష్యత్ భద్రతా ముప్పులను ధీటుగా ఎదుర్కోవాలని సూచన**

**చట్టబద్ధమైన అనుమతుల మేరకే తుపాకులు కొనాలని వెల్లడి**

భవిష్యత్తులో దేశంలో హిందువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే భద్రతా ముప్పులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకోవాలని

- మిగతా 3వ పేజీలో

## ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

**కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందన్న కేటీఆర్**

**తెలంగాణలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గాయని విమర్శ**

**ఆర్బీఐ నివేదిక ప్రకారం పంచాయతీ సగటు వ్యయం రూ.6.24 లక్షలకు పడిపోయిందని వెల్లడి**



## ఇక చెత్తకు ఫీజు!

**ఫంక్షన్లో 100 మంది దాటితే కఠినంగా నిబంధనలు**

**కిలో వ్యర్థాలకు మూడు రూపాయల ఫీజు చెల్లించాల్సిందే**

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సరికొత్త ఆంక్షలు**

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించే శుభకార్యాలు,, వేడుకలు, బహిరంగ సభలకు సంబంధించి ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను అమల్లోకి తెచ్చింది. నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్యం మెరుగుపరచడం, వేడుకల అనంతరం రోడ్లపై చెత్తను

- మిగతా 3వ పేజీలో




## మోదీ, షా, ఒవైసీది ఒకటే జట్టు

### అసదుద్దీన్‌పై తొలిసారి రేవంత్ ఫైర్

**మోదీ, షా, ఒవైసీ కలిసి మత రాజకీయాలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి**

**దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేసి గెలవాలని అమిత్ షాకు సవాల్**

**తెలంగాణలో బీజేపీకి బలం లేదన్న రేవంత్‌రెడ్డి**

**కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే అసలు ప్రత్యర్థని స్పష్టీకరణ**

**లోక్‌సభ స్థానాల పెంపుతో దక్షిణాది ప్రాధాన్యం తగ్గుతుందని ఆందోళన**

- మిగతా 2 వ పేజీలో



## రూ.లక్ష కోట్ల మేఘా!

**ఏకైక అధిపతిగా కృష్ణా రెడ్డి**

**1989లో రూ.5 లక్షల పెట్టుబడితో ప్రస్థానం**

**అనతి కాలంలోనే గణనీయమైన అభివృద్ధి**



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మేఘా కంపెనీలో కీలక మార్పు. లక్ష కోట్ల సంస్థకు అధిపతిగా కృష్ణారెడ్డి మారారు. దేశీయ మౌలిక సదుపాయాల రంగంలో దిగ్గజ సంస్థగా ఎదిగింది మేఘా. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే

- మిగతా 2 వ పేజీలో

## అగ్రి- పౌల్ట్రీ దిగ్గజంపై ఐటీ పంజా!

**స్నేహ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ పై ఆదాయపు పన్నుల శాఖ దాడులు**

**తెలుగు రాష్ట్రాల్లో 16 చోట్ల తనిఖీలు**

**పన్ను ఎగవేత కోణంలో దర్యాప్తు**




**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు మెరుపు దాడులు చేశారు. పౌల్ట్రీ, అగ్రి బిజినెస్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న స్నేహ గ్రూప్ సంస్థలపై దాడులు జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మొత్తం 16 ప్రాంతాల్లో ఐటీ బృందాలు ఏకకాలంలో రంగంలోకి దిగి.. ముమ్మర తనిఖీలు చేపట్టాయి. హైదరాబాద్ కొండాపూర్ లోని స్నేహ గ్రూప్ ప్రధాన కార్యాలయం తో పాటు విజయవాడ, ఇతర ప్రాంతాల్లో ఉన్న

- మిగతా 2వ పేజీలో




## అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్ న్యూస్!

**తెలంగాణలో 1.65 లక్షల మంది డిపాజిటర్లకు ఊరట**

**ఈనెల 25 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం**



## తమిళనాడు మంత్రి రీల్స్ పిచ్చి!

**అంతర్రాష్ట్ర వివాదంగా మారే అవకాశం**

**వన్యప్రాణులకు ఆటంకం ..కర్ణాటక ప్రభుత్వం సీరియస్**

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడులో టివికే ఎమ్మెల్యేలు, మంత్రులు తరచూ వివాదాస్పద అంశాల్లో కూరుకుపోతూనే ఉన్నారు. తాజాగా సామాజిక న్యాయశాఖ మంత్రి వన్ని అరసు వ్యవహార శైలి ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. సోషల్ మీడియా రీల్స్ పిచ్చితో అటవీ సంరక్షణ నిబంధనలను తుంగలో తొక్కుతూ.. అభయారణ్యాల్లో

- మిగతా 2వ పేజీలో




## అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు!

**మారిన ప్రభుత్వ నిర్ణయం.. రెండు విభాగాలుగా నిర్మాణం**

**అలైన్‌మెంట్ మార్చిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా**





## అమరావతి అవుటర్

# రింగ్ రోడ్డు!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** అమరావతి రాజధాని నిర్మాణం పై ఫుల్ ఫోకస్ పెట్టింది ఏపీ ప్రభుత్వం. 2028 లోగా తొలి విడత పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉంది. ఒకవైపు కోర్ క్యాపిటల్ లో నిర్మాణాలు, ఆపై కేంద్ర ప్రభుత్వ రవాణా నిర్మాణాలను కులికి తేవాలని చూస్తోంది. అయితే తాజాగా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పైన దృష్టి పెట్టింది. నాలుగు ప్యాకేజీల్లో ఈ నిర్మాణం పూర్తిచేయాలని తొలుత డిసైడ్ అయింది. కానీ ఇప్పుడు నిర్ణయం మారింది. అందులో భాగంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా టెండర్లు ఆహ్వానించింది. దీంతో అవుటర్ రింగ్ రోడ్డు రూట్ ఖరారు అయింది. మండలాలు, గ్రామాలను కూడా ఫిక్స్ చేశారు. అమరావతి రాజధాని నిర్మాణంలో ఈ ప్రాజెక్టు కీలకంగా భావిస్తున్నారు.




**గతంలో నాలుగు ప్యాకేజీలుగా..**

గతంలో ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి నాలుగు ప్యాకేజీలుగా విభజించింది నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా. తాజాగా దానిని రెండు ప్యాకేజీలుగా కుదించింది. పబ్లిక్ ప్రైవేట్ అప్రైజల్ కమిటీ సూచనల మేరకు ప్యాకేజీల్లో మార్పులు జరిగాయి. ఏపీఎసి ఆమోదం తెలపడంతో ఔటర్ రింగ్ రోడ్డు టెండర్ల ప్రక్రియ తిరిగి మొదలైంది. కాంట్రాక్టర్లు బిడ్లు సమర్పించేందుకు జనవరి 15 వరకు గడువు ప్రకటించింది. రాజా దండర్లలో ఔటర్ రింగ్ రోడ్డు పొడవు మొత్తం 195. 13 కిలోమీటర్లు గా పేర్కొన్నారు. ఇందులో ప్రధానమైన ఔటర్ రింగ్ రోడ్డు 189.93 కిలోమీటర్లు కాగా.. గుంటూరును ఓఆర్ఆర్ తో కలిపేందుకు నారాకోడూరు నుంచి గుంటూరు శివారులో ఉన్న బుడంపాడు వరకు 5.2 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల్లో నిర్మించే కనెక్ట్ రోడ్డుతో కలిపి.. మొత్తం 195.13 కిలోమీటర్లు గా పేర్కొన్నారు. అయితే తొలితా పిలిచిన టెండర్లలో దీనిని 27.93 కిలోమీటర్లు, 56 కిలోమీటర్లు, 55.7 కిలోమీటర్లు, 55.5 కిలోమీటర్లు చొప్పున నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. రాజా నిర్ణయం మేరకు ఇప్పుడు రెండు ప్యాకేజీలుగా మార్చారు. అందులో లి తొలి ప్యాకేజీ పొడవు 87.63 కిలోమీటర్లు. అది ఎన్టీఆర్ జిల్లా కంచికర్ల సమీపం నుంచి అదిరిపల్లి, ఉయ్యూరు మీదుగా కృష్ణా జిల్లా కంకిపాడు మండలం చలివేంద్రపాలెం వరకు ఉంటుంది. రెండో ప్యాకేజీ కింద 107.50 కిలోమీటర్లు రహదారి ఉండనుంది. అది ఉయ్యూరు, గుంటూరు మీదుగా కంచి కర్ల వరకు ఉంటుంది. కృష్ణా నదిపై నిర్మించి రెండు కీలకమైన వంతెనలు ఈ ప్యాకేజీ పరిధిలోకి వచ్చేలా ప్లాన్ చేశారు. ఓ ఆర్ ఆర్ నిర్మాణం పూర్తి కాగానే టోల్ ప్లాజాలు ఏర్పాటు చేస్తారు. టోల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని 30 వాయిదాలలో చెల్లించే టెండర్లు ఆహ్వానించారు. ఈ ఓ ఆర్ ఆర్ పరిధిలోకి ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు, పల్నాడు, గుంటూరు జిల్లాలు వస్తాయి. మొత్తం రూ.15,116.45 కోట్లు ఖర్చు అవుతుందని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అంచనా వేసింది.

# రూ.లక్ష కోట్ల మేఘా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఇంజనీరింగ్ అండ్ ఇంఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ యాజమాన్యంలో కీలక మార్పు చోటు చేసుకుంది. కుటుంబ ఒప్పందంలో భాగంగా కంపెనీ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పామిరెడ్డి పిచ్చిరెడ్డి వద్ద ఉన్న 43% వాటాను.. మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే సంస్థలో 57% వాటా కలిగి ఉన్న కృష్ణారెడ్డి.. ఈ తాజా కొనుగోలుతో మేఘా గ్రూప్ పై పూర్తి నియంత్రణ సాధించనున్నారు. ఈ భారీ లావాదేవీలకు అంతర్జాతీయ మధుపరులు.. ఆ సంస్థ విలువను లక్ష కోట్ల రూపాయలుగా అంచనాలు సంచలనంగా మారింది.

**భారీగా నిధుల సమీకరణ..**

తన మేనమామ పిచ్చిరెడ్డి వాటాను కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధుల సమీకరణ చేశారు కృష్ణారెడ్డి. ప్రపంచస్థాయి ఇంగ్లీష్ సిమెంట్ సంస్థల నుంచి 700 మిలియన్ డాలర్లు అంటే.. సుమారు 7000 కోట్ల రూపాయలు సమీకరించారు. అమెరికాకు చెందిన దేవిడ్సన్ క్యాంపర్న్ క్యాపిటల్ మేనేజ్మెంట్ నేతృత్వంలో, వర్డే పార్ట్నర్స్, హిల్ హౌస్ కాపిటల్ వంటి దిగ్గజ ప్రైవేట్ క్రెడిట్ సంస్థలు ఈ భారీ డీల్ లో భాగస్వాములయ్యారు. భారతీయ మౌలిక సదుపాయాల రంగంలో ప్రైవేటు క్రెడిట్ నిధులతో జరుగుతున్న అతిపెద్ద కార్పొరేషన్ లావాదేవీల్లో ఇది ఒకటి.

**37 ఏళ్ల కిందట..**



1989లో హైదరాబాద్లోని బాలానగర్లో పారిశ్రామిక వాడలో కేవలం 5 లక్షల రూపాయల పెట్టుబడితో ప్రారంభమైంది మేఘా. ఒక చిన్న పైపుల తయారీ వర్క్ షాప్ గా పిచ్చిరెడ్డి ప్రారంభించిన ఈ సంస్థ.. తరువాత కృష్ణా రెడ్డి సారథ్యంలో అసాధారణ వృద్ధిని సాధించింది. నేడు సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, సొరంగాలు, విద్యుత్, హైడ్రో కార్బన్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, సిటీ గ్యాస్ వంటి బహుళ రంగాల్లో విస్తరించి 20 కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కంపెనీకి చెందిన ఎనర్జీ ట్రాన్సిషన్ విభాగం విలువను కూడా సుమారు 14000 కోట్లుగా లెక్క కడుతున్నారు. అంతర్జాతీయ ప్రాజెక్టులు సైతం చేపట్టే వీలుగా మేఘా అవతరించింది.

# అగ్రి- పౌల్ట్రీ దిగ్గజంపై ఐటీ పంజా!



సంస్థ బ్రాంచ్ కార్యాలయాలు, ప్రాసెసింగ్ ప్లాంట్లలో అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ముఖ్యంగా సంస్థ డైరెక్టర్లు రామ్ రెడ్డి,, వరుణ్ రెడ్డి, స్నేహ నివాసాల్లోను ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ.. సంస్థ ఆర్థిక లావాదేవీలు, పన్ను చెల్లింపులకు సంబంధించి కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ రికార్డులను పరిశీలిస్తున్నారు.

**సుదీర్ఘ చరిత్ర..**

స్నేహ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కు గొప్ప చరిత్ర ఉంది. 1982లో హైదరాబాదులో చిన్న స్థాయి రామ్ రెడ్డి చికెన్ మార్కెట్ గా ప్రారంభమైంది. 1994లో స్నేహ ఫామ్స్ గా విస్తరించి నేడు దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పౌల్ట్రీ దిగ్గజాల్లో ఒకటిగా ఎదిగింది. పౌల్ట్రీ బ్రీడింగ్, హేచరీలు, చికెన్ ప్రాసెసింగ్ తో పాటు పశువుల దాణా, సోయా ప్రాసెసింగ్, సఫల బ్రాండ్ పేరుతో వంటనూనెల తయారీ రంగాల్లో స్నేహ గ్రూప్ భారీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తెలంగాణలో గంటకు 12 వేల కోళ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యం గల అత్యంత ఆధునిక ఆటోమేటెడ్ ప్లాంటును ఈ సంస్థ కలిగి ఉంది. 2000 మందికి పైగా కాంట్రాక్టు రైతులతో కలిసి వ్యాపారం నిర్వహిస్తూ.. భారత రక్షణ సంస్థలకు సైతం ఫ్రోజెన్ చికెన్ సరఫరా చేసే స్థాయి కి చేరుకుంది.

**భారీ విస్తరణ ప్రణాళికలు..**

ఇటీవల కాలంలో స్నేహ గ్రూప్ భారీ విస్తరణ ప్రణాళికలు, అంతర్జాతీయ పెట్టుబడుల ఒప్పందాలతో వ్యాపార వర్గాల్లో ప్రముఖంగా నిలిచింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రముఖ సింగ్ పౌల్ట్రీ ని కొనుగోలు చేయడం ద్వారా తన మార్కెట్ వాటాను మరింత పెంచుకుంది ఈ సంస్థ. ఇటీవలే జపాన్ కు చెందిన ప్రఖ్యాత వాణిజ్య దిగ్గజం మిట్సుయి అండ్ కో నుంచి సుమారు 300 మిలియన్ డాలర్లకు పైగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్చలు జరుపుతోంది. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో జరిగిన కొనుగోళ్లు, వ్యాపార విస్తరణ, ఆదాయ వ్యయాల లెక్కల్లో ఏవైనా అవకతవకలు జరిగాయా? పన్ను ఎగవేతకు పాల్పడ్డారా? అనే కోణంలో ఐటి శాఖ ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో 16 చోట్ల కొనసాగుతున్న ఈ తనిఖీల్లో పలు కీలక ఫైళ్లు, హార్డ్ డిస్కులు, బ్యాంకు లావాదేవీల వివరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా తెలుగు రాష్ట్రాల్లో అత్యంత వేగంగా ఎదుగుతున్న అగ్రి పౌల్ట్రీ దిగ్గజంపై ఒక్కసారిగా ఐటి దాడులు జరగడం పారిశ్రామిక, వ్యాపార వర్గాల్లో కలకలం రేపుతోంది.

# తమిళనాడు మంత్రి రీల్స్ పిచ్చి!

వన్యప్రాణులను వెంబడించడం ఆయనను చిక్కుల్లో పడేసింది. కర్ణాటకలోని బందీపూర్ టైగర్ రిజర్వులో ఒక అడవి ఏనుగుకు అత్యంత సమీపంగా వెళ్ళిన వీడియో వైరల్ అయింది. ఈ ఘటనపై కర్ణాటక అటవీ శాఖ మంత్రి రామలింగారెడ్డి తీవ్రంగా స్పందించారు. వీడియోలో కనిపించిన వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అటవీ, పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు.

**తరచూ వివాదాలు..**

మరోవైపు తమిళనాడులోని మధుమలై టైగర్ రిజర్వులోను మంత్రి వన్ని అరసు సఫారీ వాహనాల నుంచి కిందకు దిగి ఒక పులిని వెంబడిస్తూ రీల్స్ చిత్రీకరించిన మరో వీడియో దుమారానికి దారితీసింది. అభయారణ్యాల పరిధిలో వాహనాల నుంచి బయటకు రావడం, వన్యప్రాణులకు ఆటంకం కలిగించడం చట్టరీత్యా నేరమైనప్పటికీ.. ఒక బాధ్యతయుతమైన మంత్రి హోదాలో ఉండి ఇలా ప్రవర్తించడంపై పర్యావరణవేత్తలు, జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులు చిన్న తప్పు చేస్తే కేసులు నమోదు చేసి అటవీ శాఖ అధికారులు.. మంత్రి వెంట ఉండి మరి నిబంధనలు ఉల్లంఘించడానికి సహకరించడం పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**మారని వైఖరి..**

ముఖ్యమంత్రి విజయ్ సొంత పార్టీ నేతలకు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్న వారి వైఖరిలో మార్పు రావడం లేదు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు క్రమశిక్షణతో మెలగాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే లేదా వివాదాలకు దారి తీసే పనులు చేయవద్దని పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. అయినా కొందరి వైఖరిలో మార్పు రావడం లేదు. ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదు. మంత్రి అరసు పదేపదే ఇలాంటి వివాదాలు చిక్కుకోవడం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. మరోవైపు కర్ణాటక అటవీ శాఖ మంత్రి రామలింగారెడ్డి అయితే అటవీ చట్టాలు అందరికీ సమానమే.. ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా సరే నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు అని తేల్చి చెప్పడం ఈ వ్యవహారం తీవ్రతకు అర్థం పడుతోంది. సోషల్ మీడియాలో ప్రచారం కోసం మంత్రి చేసిన ఈ అతి ఇప్పుడు అంతర్రాష్ట్ర వివాదంగా మారే అవకాశం ఉంది.

# మోదీ, షా, ఒవైసీది ఒకటే జట్టు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు ఒవైసీ కూడా మత రాజకీయాలు చేస్తూ పరస్పరం రాజకీయ లబ్ధి పొందుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురి రాజకీయ వైరుధ్యం కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని పేర్కొన్నారు. మోదీ, అమిత్ షా ఒకవైపు హిందువులను, మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలను ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ మతపరమైన చీలిక ద్వారా మూడు పార్టీలూ ప్రయోజనం పొందుతున్నాయని రేవంత్ విశ్లేషించారు. 70 ఏళ్లుగా కాంగ్రెస్ మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలు చేసిందన్న బీజేపీ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తమ పార్టీ మతం, కులంతో సంబంధం లేకుండా సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ నేత ఆజం ఖాన్ చేసిన 'హైదరాబాదీ బిర్యానీ' వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఒవైసీ రాజకీయాలు ఒక ప్రాంతానికే పరిమితమని పరోక్షంగా ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్కు బీఆర్ఎస్ మాత్రమే ప్రధాన ప్రత్యర్థి అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోయిన విషయాన్ని గుర్తుచేశారు. "నిజంగా ధైర్యం ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ లోక్సభ స్థానం నుంచి పోటీ చేసి అసదుద్దీన్ ఒవైసీని ఓడించాలి" అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్పైనా రేవంత్ తన విమర్శల దాడిని కొనసాగించారు. మాజీ సీఎం కేసీఆర్ను 'రావణాసురుడు'గా, కేటీఆర్ను 'మేనేజ్మెంట్ కోటా' నేతగా అభివర్ణించారు. అదే సమయంలో, లోక్సభ నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్సభ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

# భవిష్యత్‌లో ప్రమాదం రాబోతోంది..



పిలుపునిచ్చారు. చట్టప్రకారం అనుమతులు పొంది ప్రతి హిందువు తప్పనిసరిగా లైసెన్స్డ్ తుపాకీని దగ్గర ఉంచుకోవాలని అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడిన వీడియో దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా నానాటికీ పెరిగిపోతోందని రాజాసింగ్ తన వీడియోలో ప్రస్తావించారు. దీనివల్ల కాలక్రమేణా భారతదేశంలో హిందువుల ఉనికికి, భద్రతకు పెను సవాలు ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. అలాంటి అనిశ్చిత పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు సమాజం ఎలా తట్టుకుంటుందని ప్రశ్నించారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ధీటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఆత్మరక్షణ కోసమే తుపాకులు కొనుగోలు చేయాలని చెప్పిన ఆయన, దానికి సంబంధించి చట్టబద్ధమైన నిబంధనలను పాటించాలని గుర్తుచేశారు. ఈ వీడియో నెట్టింట బయటకు రావడంతో తీవ్ర దుమారం చెలరేగింది. ఒక ప్రజాప్రతినిధి బహిరంగంగా ఇలాంటి పిలుపునివ్వడంపై రాజకీయ పక్షాలు, సామాజిక వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్ న్యూస్!

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్ న్యూస్. ఏళ్ల తరబడి తమ కష్టార్జితం కోసం ఎదురుచూస్తున్న సుమారు 1.65 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట కలగనుంది. రూ.447 కోట్ల అగ్రిగోల్డ్ కుంభకోణానికి సంబంధించి బాధితుల డిపాజిట్ల వివరాలను నిర్ధారించేందుకు జిల్లాల వారీగా.. మండలాల వారీగా బాండ్ల వెరిఫికేషన్ షెడ్యూల్ ను సిఐడి అధికారికంగా విడుదల చేసింది. ఈనెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో అసలు బాండ్లు, రసీదుల ధ్రువీకరణ ప్రక్రియ ప్రారంభం కాండడంతో బాధితుల్లో మళ్ళీ ఆశలు చిగురించాయి.

**చట్టబద్ధ వారసులకు సైతం..**

అగ్రిగోల్డ్ బాధితుల ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ ప్రక్రియలో డిపాజిటర్లతో పాటు ఒకవేళ డిపాజిటర్ మరణించి ఉంటే వారి నామినేలు లేదా చట్టపరమైన వారసులు కూడా పాల్గొనవచ్చని సిఐడి స్పష్టం చేసింది. బాధితుల సౌకర్యార్థం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబ్నగర్, నల్గొండ, మంచిర్యాల, నిజామాబాద్, మెదక్ జిల్లా




కేంద్రాల్లో ఈ పది వెరిఫికేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఒరిజినల్ బాండ్లను కేవలం అధికారుల పరిశీలన కోసం మాత్రమే తీసుకురావాలని.. వాటిని అక్కడే అప్పగించాల్సిన అవసరం లేదని సిఐడి భరోసా ఇచ్చింది. బాధితులంతా తమకు కేటాయించిన తేదీలు, కేంద్రాలను చూసుకుని తగిన ద్రౌపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

**ఏపీ ఇప్పటికే..**

ఏపీ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేసేందుకు అడుగులు వేస్తోంది. ఈడి జప్తు చేసి అప్పగించిన వేలకోట్ల రూపాయల విలువైన అగ్రిగోల్డ్ ఆస్తులతో పాటు సంస్థ కు చెందిన సుమారు 6330 ఎకరాల భూములను వేలం వేసి.. ఆ నిధులతో బాధితులందరికీ డబ్బులు చెల్లించాలని ఏపీ మంత్రి వర్గ ఉప సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో ముమ్మరంగా బాండ్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు ప్రత్యేక కోర్టుల ద్వారా న్యాయపరమైన అడ్డంకులను తొలగించి సాధ్యమైనంత త్వరగా పరిహారం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. అయితే ఇప్పుడు తెలంగాణలోనూ బాండ్ల వెరిఫికేషన్ షెడ్యూల్ ప్రారంభం కావడం లక్షలాదిమంది అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట నిచ్చే అంశం

# ఇక చెత్తకు ఫీజు!

(మొదటి పేజీ తరువాయి)

పారవేసే సంస్కృతికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల అమలుపై డిప్యూటీ కమిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లైసెన్స్ లేని వేదికలు లేదా ఇతర ప్రాంతాల్లో 100 మందికి మించి హాజరయ్యే ఎలాంటి వేడుకలు, సమావేశాలు నిర్వహించాలన్న కనీసం మూడు పని దినాలు ముందుగా సమాచారం ఇవ్వడం తప్పనిసరి చేశారు.

**ప్రత్యేక పోర్టల్ ద్వారా..**

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ఈవెంట్ ఇంటిమేషన్ పోర్టల్ ద్వారా ఈ ముందస్తు సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. తద్వారా వేడుకలు జరిగే ప్రదేశాల్లో ఉత్పత్తి అయ్యే చెత్తను సకాలంలో సేకరించేందుకు, తరలించేందుకు మున్సిపల్ సిబ్బందికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు భారీగా చెత్తను ఉత్పత్తి చేసే సంస్థలు, వేడుకల నిర్వాహకులపై ఆర్థిక బాధ్యతను కూడా కమిషనర్ నిర్దేశించారు. వేడుకలు, బల్క్ జనరేటర్ల వద్ద ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం కిలోకు సుమారు మూడు రూపాయల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా వేడుక జరిగిన ప్రాంగణంలోనే తడి చెత్త, పొడి చెత్త, ఇతర వ్యర్థాలుగా విభజించి.. మున్సిపల్ కార్పొరేషన్ గుర్తించిన అధికృత వ్యర్థ సేకరణ




ఏజెన్సీలకు మాత్రమే అప్పగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

**కమిషనర్ వెల్లడి..**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలోని ఆదేశాలను జారీ చేసినట్లు కమిషనర్ సృజన వెల్లడించారు. చెత్త సేకరణ, రవాణా తో పాటు శాస్త్రీయ పద్ధతిలో దానిని శుద్ధి చేసే బాధ్యత కూడా నిర్వాహకులదేనని తేల్చి చెప్పారు. ఈ కొత్త నిబంధనలపై తమ పరిధిలోని ఫంక్షన్ హాళ్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థలు, నిర్వాహకులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని.. పారిశుద్ధ్య అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిబంధనలను పక్కాగా అమలయ్యే విధంగా పర్యవేక్షించాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు.

# శ్రీవారికి 160 కిలోల బంగారం!

(మొదటి పేజీ తరువాయి)

బరువు ఉన్న అత్యంత విలువైన బంగారు ఆభరణాలను తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళంగా అందించనున్నారు. బహిరంగ మార్కెట్లో ఈ బంగారు ఆభరణాల విలువ దాదాపు రూ.250 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్వామివారి నిత్య, విశేష అలంకరణలు, కైంకర్యాలకు ఉపయోగపడేలా ప్రత్యేకంగా తయారు చేయించిన మొత్తం 40 రకాల బంగారు ఆభరణాలను సదరు భక్తుడు కానుకగా సమర్పిస్తున్నారు. అత్యంత నాణ్యమైన బంగారంతో, అద్భుతమైన హస్తకళ నైపుణ్యంతో ఈ ఆభరణాలను రూపొందించినట్లు సమాచారం.

**ఆ భక్తుడు ఎవరు?**

ఇంతటి భారీ విరాళం సమర్పించిన భక్తుడి పేరు బయటకు రావడం లేదు. కానీ ఈ నెల 26న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ భారీ బంగారు ఆభరణాలను టీటీడీ అధికారులకు అధికారికంగా అందజేయనున్నారు. శ్రీవారిపై ఉన్న అపారమైన భక్తి విశ్వాసాలతో ఈ భారీ విరాళాన్ని అందిస్తున్నట్లు తెలుస్తుండగా.. కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. వడ్డీ కాసుల వాడికి భక్తులు తమ మొక్కులు రూపంలో నగదు, బంగారం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఒకేసారి 160 కిలోల బంగారు ఆభరణాలను కానుకగా ఇవ్వడం టీటీడీ చరిత్రలోనే అత్యంత అరుదైన, భారీ విరాళాల్లో ఒకటిగా నిలవనుంది. ముఖ్యమంత్రి సమక్షంలో జరిగే ఈ కార్యక్రమం ద్వారా ఖజానాకు రూ.250 కోట్ల విలువైన అమూల్యమైన ఆభరణాలు జమ కానున్నాయి.

**సీఎం ముందే హింట్..**

ఇంతటి భారీ విరాళం పై చర్చ నడుస్తోంది. గతంలో సీఎం చంద్రబాబు ఓ ప్రెస్ మీట్ లో ఇలాంటి భారీ విరాళం గురించి ప్రస్తావించారు. బహుశా ఆవిరాలమే ఇది అయి ఉంటుందని భావిస్తున్నారు. కానీ సదరు భక్తుడు పేరు మాత్రం బయటకు రావడం లేదు. శ్రీవారి వైభవాన్ని మరింత ఇనుమడింప చేసేలా, స్వామి వారి అలంకరణ కోసం 40 రకాల ఆభరణాలను సమర్పిస్తున్న భక్తుడి భక్తి తత్పరతపై ఆధ్యాత్మిక వర్గాలు, సామాన్య భక్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కచ్చితంగా ఆ భక్తుడి పేరు బయటపడే అవకాశం ఉంది. ఎందుకంటే ప్రభుత్వ వర్గాల సమక్షంలోనే ఇంతటి భారీ బంగారు ఆభరణాలను అందించనుండడంతో.. పేరు



ప్రకటించడం అనివార్యం. ఈ విషయంలో ఎలాంటి ప్రకటన వస్తుందో చూడాలి. అందరిలోనూ అదే ఆసక్తి.

# స్వచ్ఛత పాటించాలి : ఉప..కమిషనర్ చాముండేశ్వరి


**కూకట్ పల్లి, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** ఇంట్లో నిత్యం పూజించే దేవదేవుళ్ళ ఫోటోలు పాతవై, పగిలిన ఫోటోలు ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. అలాంటి సమస్యను పరిష్కరించాలని సీఎంసి అధికారులు ఇంట్లో ఉన్న పాత దేవదేవుళ్ళ ఫోటోల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శనివారం ఆల్విన్ కాలనీ సర్కిల్ ఉప..కమిషనర్ చాముండేశ్వరి పాపిరెడ్డి నగర్ బస్తీలో పర్యటించి స్థానిక అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డితో కలిసి శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం కమిటీ హాల్లో పాడైన దేవుళ్ల ఫోటోలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ బహిరంగ ప్రదేశాలు చెత్తను వేయకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా దేవుళ్ళ ఫోటోలు చెత్తలో వేయకుండా ప్రత్యేక కార్యక్రమం ద్వారా దేవుని ఫోటోలను సేకరిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ తమ నివాస ప్రాంతాల్లో స్వచ్ఛత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. శంకర్ , గణేష్, ఏఈఈ బాన్సీ పాటిల్ శానిటరీ జవాన్ కె.కుమార్,వార్డు ఇంచార్జి చైతన్య, ప్రకాష్ మాల్యాల, సనిటేషన్ సూపర్వైజర్ రాములు.ఇతర పారిశుధ్య కార్మికులు సిబ్బంది తో



పాటుగా ప్రగతి నగర్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు, బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, అధ్యక్షుడు అడెపు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రాపోలు తిరుపతి రెడ్డి, కోశాధికారి పై.శంకర్ రెడ్డి నేతలు వనం ఆంజనేయులు, చంద్రయ్య, పాండు గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:**



చిట్యాల మండలం నేరడ గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి స్వగృహంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అయ్యప్ప స్వామిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక అమరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్స్టిట్యూషన్స్' నివేదికను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఈ వివరాలను వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు సగటున ఒక్కొక్కటి రూ.16.59 లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 2024-25 నాటికి ఆ మొత్తం రూ.6.24 లక్షలకు పడిపోయిందని ఆయన తెలిపారు.ప్రజలు కట్టిన పన్నులు, ప్రభుత్వం తెస్తున్న అప్పులు అభివృద్ధి పనులకు చేరడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో పల్లె నుంచి పట్నం వరకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, జరుగుతున్నదంతా విధ్వంసమేనని కేటీఆర్ పేర్కొన్నారు.

## పేదల జీవితాల్లో కొత్త వెలుగులు..

### 4.63 లక్షల మందికి కొత్త చేయూత పింఛన్లు!

### పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులే..

### కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు ఆర్థిక భరోసా

### కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ మట్టె ప్రసన్నకుమార్



**బాలానగర్, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్రంలో పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ మట్టే ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లక్షలాది మంది అర్హులు మంజూరు కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ప్రభుత్వ సహాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఆశించిన ఫలితం దక్కలేదని అన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు కొత్త పింఛన్ల మంజూరు**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తూ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి చేయూత పింఛన్లు మంజూరు చేయడం హర్షణీయమని ప్రసన్నకుమార్ తెలిపారు. ఇందులో 2,77,894 మంది వితంతువులు, 1,00,224 మంది దివ్యాంగులు, 53,844 మంది ఒంటరి మహిళలు, 27,444 మంది గీత కార్మికులు, 4,451 మంది చేనేత కార్మికులు ఉన్నారని వివరించారు. ఈ నిర్ణయం ద్వారా ఎన్నో పేద కుటుంబాలకు నెలవారీ ఆర్థిక భరోసా లభించడంతో పాటు వారి జీవనోపాధికి కొంత ఊరట కలుగుతుందని పేర్కొన్నారు.

**పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

సమాజంలోని అట్టడుగు వర్గాలు, బడుగు బలహీన వర్గాలు, నిరుపేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పింఛన్ అనేది కేవలం నెలవారీ ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వయోభారం, అనారోగ్యం, కుటుంబ సమస్యలు, ఉపాధి లేమితో సతమతమయ్యే పేదలకు అది ఆత్మగౌరవంతో కూడిన జీవనాధారమని అన్నారు. ముఖ్యంగా కుటుంబ పోషణకు ఇతరులపై ఆధారపడే పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ పింఛన్లు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువస్తూ పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పింఛన్ అంటే కేవలం డబ్బు కాదు.. పేదవాడి ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, గౌరవప్రదమైన జీవనానికి భరోసా. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మట్టే ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 ఆదివారం 22-11-2026




## ఉత్తమ ఫోటోజర్నలిస్టుగా శ్రవణ్ కుమార్

**కూకట్ పల్లి, నవంబర్ 21(క్రైమ్ మిర్రర్):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ (ట్రాజీమా) నిర్వహించిన ఉత్తమ వార్తా ఛాయాచిత్రాల పోటీ--2026లో నమస్తే తెలంగాణ ఫోటోజర్నలిస్ట్ గడ్డం శ్రవణ్ కుమార్ అవార్డు అందుకున్నారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ అవార్డును ప్రదానం చేశారు.సమాజంలో చోటుచేసుకునే మార్పులు, ప్రజా సమస్యలను ఛాయాచిత్రాల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపిస్తూ.. వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేయగల వృత్తిలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నట్లు శ్రవణ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా అవార్డు అందుకున్న శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, సీనియర్ ఫోటోజర్నలిస్టులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలను ప్రతిబింబించే ఉత్తమ ఛాయాచిత్రాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం


**ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై సత్వర స్పందన ఆల్విన్ కాలనీ డీసీ చాముండేశ్వరి**



**కూకట్ పల్లి, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటామని డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. రోడ్లు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, చెత్త సేకరణ తదితర మౌలిక వసతుల సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు తమ ఫిర్యాదులను మైక్యూర్ యాప్, ఎక్స్ (ట్విట్టర్), సర్కిల్ కార్యాలయంలోని ఇన్‌వార్డ్ విభాగం ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తామని, ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ నెల చివరి నుంచి ప్రతిరోజూ ఒక వార్డులో పర్యటించే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు పర్యటనల్లో ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కార చర్యలు చేపడతామని వెల్లడించారు.అనుమతులు లేని నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలు, రహదారులు, ప్రజా స్థలాల ఆక్రమణలపై అందే ఫిర్యాదులను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రతి కాలనీ, బస్తీ అభివృద్ధికి కృషి చేస్తామని డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు.

# రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటు..

**ఏనుగు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం.. వివిధ జిల్లాలకు చెందిన నాయకులకు కీలక బాధ్యతలు**



**కూకట్ పల్లి, నవంబర్ 21(క్రైమ్ మిర్రర్) :** రెడ్డి సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధి చిట్టి రెడ్డి రిసార్ట్ లో జరిగిన రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి, నూతన పాలకవర్గం ఏర్పాటు చేశారు. తెలంగాణలో వివిధ జిల్లాల రెడ్డి సంఘాల పెద్దల ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యనిర్వహ కమిటీ ని ఏనుగు సంతోష్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులుగా హైదరాబాద్ కు చెందిన పట్లోల్ల నాగిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నేరెళ్ల భూమిరెడ్డి (జగిత్యాల), రామన్నగారి బాగారెడ్డి (మెదక్), పాండురంగారెడ్డి (సంగారెడ్డి), దొంగల బాపురెడ్డి (సిద్దిపేట), పోసానిపల్లి మైపాల్ రెడ్డి (మేడ్చల్), ఏనుగు వెంకట్ రెడ్డి (నల్గొండ) బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా చందిరి కొండల్ రెడ్డి (హైదరాబాద్), రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏలేటి రామ్ రెడ్డి (కామారెడ్డి), రాష్ట్ర కార్యదర్శిగా ఏలేటి భూమిరెడ్డి (కామారెడ్డి), రాష్ట్ర కోశాధికారిగా గుర్రం పాపిరెడ్డి (రంగారెడ్డి) నియమితులయ్యారు.

**ముఖ్య సలహాదారులుగా ప్రముఖులు**

రాష్ట్ర ముఖ్య సలహాదారులుగా మనోహర్ రెడ్డి (జగిత్యాల), మింకూరి రామ్ రెడ్డి (కామారెడ్డి), సీహెచ్ సదాకర్ రెడ్డి (హైదరాబాద్), కందడి ప్రవీణ్ రెడ్డి (కామారెడ్డి)లను నియమించారు. రాష్ట్ర సామాజిక మాధ్యమాల సమన్వయకర్తగా కందడి ప్రవీణ్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి వెల్లడించారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఐక్యతే ప్రధాన లక్ష్యం**

ఈ సందర్భంగా ఏనుగు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఉన్న రెడ్డి సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యంగా ముందుకు నడిపించడమే రెడ్డి ఐక్య వేదిక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పరస్పర సహకారం, సమన్వయంతో సామాజిక అభివృద్ధికి కృషి చేయడంతో పాటు యువతకు ప్రోత్సాహం అందించడం, విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం తమ కార్యాచరణలో ముఖ్య భాగాలని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సంఘ నిర్మాణాన్ని విస్తరించాలని పిలుపునిచ్చారు. సంఘంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని పోతూ ఐక్యత, సేవాభావం, సమాజ అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ రెడ్డి ఐక్య వేదికను రాష్ట్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు పట్ల వివిధ జిల్లాలకు చెందిన సంఘ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఇతర కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ వారి ఆధ్వర్యంలో రెడ్డి ఐక్య వేదిక రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# ఉద్యమకారుల ఉసురు తగిలి బిఆర్ఎస్ పార్టీ మట్టి కొట్టుకుపోయింది..

## పాపాల భైరవుడు ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యాడు

## బిఆర్ఎస్‌ను జనాలు నమ్మడం లేదు...గతమే తప్ప భవిష్యత్తు లేదు

## టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం


**కూకట్ పల్లి, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీష్ రావు చేసిన విమర్శలకు గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పాలనపై టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా స్పందించారు. సిద్దిపేటలో హరీష్ రావు కథ ముగిసిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. హరీష్ రావు మాట్లాడుతున్న తీరును తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు. తన మామ కోసం హరీష్ రావు ఏ స్థాయిలోనైనా నటిస్తారని, ఇలాగే పిచ్చి మాటలు కొనసాగిస్తే తెలంగాణ ప్రజల నుంచి తగిన సమాధానం తప్పదని హెచ్చరించారు. తన నియోజకవర్గ అభివృద్ధి కోసం హరీష్ రావు ఎప్పుడూ ముఖ్యమంత్రి వద్దకు వచ్చి అడగలేదని విమర్శించారు. అలాగే, ముఖ్యమంత్రి సిద్దిపేట పర్యటనకు హరీష్ రావు ఎందుకు హాజరు కాలేదని కూడా ఆయన ప్రశ్నించారు. పేదలకు కొత్త పింఛన్లు అందిస్తుంటే ఓర్వలేక కడుపుమంటతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హరీష్ రావు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు అందరికీ తెలుసని సత్యం శ్రీరంగం గుర్తు చేశారు. టీఆర్ఎస్ హయాంలో ఎలా వ్యవహరించారో, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎలాంటి నాటకాలు ఆడుతున్నారో ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని ఆయన పేర్కొన్నారు. ఉద్యమ



సమయంలో ఆంధ్రా వాళ్లపై అక్కసు చూపించిన హరీష్ రావు, ఇప్పుడు అదే ఆంధ్రా వాళ్ళతో బిజినెస్ చేస్తున్నారు. ఆంధ్రా విద్యా సంస్థలను వెళ్లగొడతామని బ్లాక్ మెయిల్ చేసి, వసూళ్లు చేసుకున్నారు. ఇప్పటికీ ఆంధ్రా వాళ్ళతో పాల వ్యాపారం చేస్తున్న, హరీష్ రావు, వాస్తవాలు ప్రజలకు చెప్పాలి. బీజేపీ నేతలతో హరీశ్ రావు లోపాయికార ఒప్పందాలు వాస్తవం కాదా అని అన్నారు. భూనిర్వాసితుల హక్కుల కోసం దేశం లోనే చరిత్ర సృష్టించిన ఉద్యమం సిద్దిపేట ప్రాంత రైతులది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూనిర్వాసితుల హక్కుల కోసం సాగిన తొలి ప్రధాన న్యాయపోరాటాల్లో మల్లన్నసాగర్, కొండపోచమ్మ నిర్వాసితుల ఉద్యమం ఒకటి. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల కోసం 18 గ్రామాలు, 20 వేల ఎకరాలకు పైగా భూములు ముంపునకు గురయ్యాయి. భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులు, నిర్వాసితులకు న్యాయం జరగాలనే లక్ష్యంతో మేము వారి పక్షాన నిలబడి పోరాటం చేశాం అని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో రైతులకు అన్యాయం చేసారని కాళేశ్వరం, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ భూములపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతోందని కాంగ్రెస్ వచ్చాక 3 సంవత్సరాలలో చేసిన కొత్త సంక్షేమం పనులు... ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, 500 కె గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 10 లక్షల రూపాయల వరకు ఆరోగ్య శ్రీ, 15 లక్షల కొత్త రేషన్ కార్డులు, రైతు రుణ మాఫీ, సన్న వడ్లకు 500 బోనస్, ఇప్పుడు కొత్తగా కోటి మందికి ఇందిరమ్మ జీవిత భీమా... ఇవ్వి కదా కాంగ్రెస్ గ్యారంటీలు.. నిత్యం రేవంత్ అన్న మీద పడి ఏడ్చే సన్నాసులు ముందు ఇవ్వి తెలుసుకోవాలి అన్నారు.

## కన్నెస్వాముల ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి పూజా మహోత్సవం

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్ష**



**కూకట్ పల్లి, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్, వివేకానంద నగర్ కాలనీలో జి. నర్సింగరావు తనయులు నిఖిల్ గౌడ్, వరుణ్ గౌడ్ ఆధ్వర్యంలో కన్యస్వాములు ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పూజా మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజ కవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ అరికెపూడి గాంధీ హాజరై అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందుతూ భక్తులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. చంద్రకాంత్, జనంపల్లి పురంధర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, చంగల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీధర్, ప్రసాద్, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, సి.కె. రెడ్డి తదితరులు పాల్గొని అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు తరలివచ్చి భక్తిపారవశ్యంతో స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను పంపిణీ చేయగా, భక్తులందరూ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ.. కన్యస్వాములు తొలిసారిగా ఇంతటి భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామివారి కృపాకటాక్షాలు స్వాములు, భక్తులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరూ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతో షాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సంతోషాలు వెల్లివిరియాలని అయ్యప్ప స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు జి. నర్సింగరావు మాట్లాడుతూ.. తమ ఆహ్వానాన్ని మన్నించి కార్యక్రమానికి విచ్చేసి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అయ్యప్ప స్వాములకు, భక్తులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తి, ఆధ్యాత్మికత, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచిన ఈ పూజా మహోత్సవం కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

## క్రికెట్ క్రీడాకారులకు శుభవార్త.. నాంపల్లిలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్!

**దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలు**

**ఈ నెల 25 నుంచి డిసెంబర్ 5 వరకు పోటీలు.**

**విజేతలకు రూ.1,00,116 ప్రథమ బహుమతి**




**నల్లగొండ జిల్లా క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:**క్రికెట్ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు దీవెన ఫౌండేషన్ చైర్మన్ బుషిపాక వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ ఈ నెల 25 నుంచి డిసెంబర్ 5 వరకు నల్లగొండ జిల్లా నాంపల్లిలో నిర్వహించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక ఉన్న క్రీడా మైదానంలో పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జట్లకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందించనున్నారు.ప్రథమ బహుమతి: రూ.1లక్ష 116,ద్వితీయ బహుమతి: రూ.50 వేల 116,మ్యాన్ ఆఫ్ ది సిరీస్ 5 వేల రూ– ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందజేయనున్నారు.




**నిబంధనలు, సూచనలు:**

1. ప్రతి జట్టు తమ క్రికెట్ కిట్, ఆట సామగ్రిని స్వయంగా తీసుకురావాలి.
2. మ్యాచ్‌లో అంపైర్‌దే తుది నిర్ణయం.
3. ఒక జట్టులో ఆడిన ఆటగాడు మరో జట్టులో ఆడటానికి అనుమతి లేదు.
4. ప్రతి మ్యాచ్ 10 ఓవర్లతో నిర్వహిస్తారు.
5. ఫైనల్ మ్యాచ్ 12 ఓవర్లతో ఉంటుంది.
6. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందజేస్తారు.
7. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.5,000 నగదు బహుమతి ఉంటుంది.
8. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి.
9. ప్రతి క్రీడాకారుడి ఆధార్ కార్డుకు సెల్‌ఫోన్ నంబర్ లింక్ అయి ఉండాలి.ఎంట్రీ ఫీజు: రూ.2,000 లు,క్రికెట్‌పై ఆసక్తి ఉన్న యువకులు, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ జట్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.మరిన్ని వివరాలకు బుషిపాక అంబేద్కర్ 960355397,సల్లపల్లి సుందర్ 9866499817,గడ్డం శ్రీను 9912640324 సంప్రదించాలని సూచించారు.దీవేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలకు యువత, క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 22-11-2026
5

# జేఎన్టీయూ విద్యార్థులందరికీ ఆరోగ్య, ప్రమాద బీమా కల్పించాలి!

**విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా వైస్ ఛాన్సలర్‌కు వినతి -- సానుకూలంగా స్పందించిన వీసీ చల్ల రామకృష్ణ రెడ్డి, పరిశోధక విద్యార్థి**



**కూకట్ పల్లి, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ( జేఎన్టీయూహెచ్) పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్), ప్రమాద బీమా (ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్) సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు కళాశాలలకు వెళ్లే సమయంలో, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, ప్రమాదాల కారణంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందాల్సి వచ్చినప్పుడు విద్యార్థుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వైస్ ఛాన్సలర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా అనుకోని ప్రమాదాల వల్ల విద్యార్థులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. జేఎన్టీయూహెచ్ పరిధిలోని హైదరాబాద్, జగిత్యాల, కొండగట్టు, మంథని, సుల్తాన్‌పూర్, రాజన్న సిరిసిల్ల, వనపర్తి, మహబూబాబాద్, పాలేరు తదితర ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు మేనేజ్‌మెంట్, ఫార్మసీ, స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, యూజీసీ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిధిలోని విద్యార్థులకు కూడా ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇటీవల 16-11-2026న జేఎన్టీయూహెచ్ హైదరాబాద్‌లోని గౌతమి పీజీ బాయ్స్ హాస్టల్ భవనం పైనుంచి దూకి బీటెక్ విద్యార్థి విక్రమ్ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటనను ప్రస్తావిస్తూ, విద్యార్థులకు ముందుగానే ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం అందుబాటులో ఉండి ఉంటే, ఇటువంటి అనుకోని మరణాల సందర్భంలో బాధిత కుటుంబానికి బీమా నిబంధనల ప్రకారం కనీసం కొంత ఆర్థిక సహాయం అందే అవకాశం ఉండేదని వైస్ ఛాన్సలర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులపై అధిక ఆర్థిక భారం పడకుండా, అభివృద్ధి రుసుము (డెవలప్‌మెంట్ ఫీ) నుంచి సంవత్సరానికి స్వల్ప మొత్తాన్ని కేటాయించడం ద్వారా ఈ బీమా సౌకర్యాన్ని అందించవచ్చని ప్రతిపాదించారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు తక్కువ ప్రీమియంతో అందించే బీమా పథకాలను పరిశీలించి, సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో విద్యార్థులందరికీ ఈ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపై వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లకు ఈ అంశాన్ని పరిశీలించాలని సూచించడంతో పాటు, జేఎన్టీయూహెచ్ క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లతో మాట్లాడి విద్యార్థులకు అనువైన బీమా పథకాల వివరాలను సేకరించాలని ఆదేశించారు.ఈ బీమా పథకం అమలులోకి వస్తే విద్యార్థులకు ప్రమాద సమయంలో ఆర్థిక సహాయం, ఆసుపత్రి చికిత్స ఖర్చులకు భరోసా, అనుకోని మరణాల సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక రక్షణ లభించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఇది ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు.విద్యార్థుల విద్యతో పాటు వారి ఆరోగ్యం, ప్రాణ భద్రతకు కూడా విశ్వవిద్యాలయం ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ వినతిని సమర్పించినట్లు చల్లా రామకృష్ణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గ, సన్నీ, జయరామ్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలందరికీ సకాలంలో టీకాలు వేయించాలి: డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్

**హాజీపూర్, గుడిపేట ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు**

**వైద్య సేవలు, టీకాల కార్యక్రమంపై సమీక్ష**



**మంచిర్యాల నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్):** జిల్లాలో చిన్నారులందరికీ నిర్దిష్ట సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుడిపేట యూనిట్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. మందుల నిల్వలు, టీకాల కార్యక్రమం అమలు తీరును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి శనివారం గ్రామాల్లో నిర్వహించే టీకాల కార్యక్రమానికి సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. టీకాలు వేయించాల్సిన పిల్లల వివరాలను ముందుగానే సేకరించి, ప్రతి చిన్నారి టీకాల కార్డులో వివరాలను నమోదు చేయాలని సూచించారు. టీకా వేసిన రోజే సంబంధిత వివరాలను నమోదు చేయాలన్నారు. తల్లిదండ్రులకు టీకాల ప్రాముఖ్యతను వివరించి, పిల్లలకు అన్ని టీకాలను నిర్ణీత సమయంలో వేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. క్షయ, పోలియో, కామెర్లు, కోరింత దగ్గు, ధనుర్వాతం, న్యుమోనియా, తట్టు, రుబెల్లా తదితర వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు టీకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అనంతరం హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారితో మాట్లాడి వైద్య సేవలపై సమీక్షించారు. జిల్లాలో 14 రకాల వైద్య ఆరోగ్య కార్యక్రమాల్లో వెనుకబడిన అంశాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది విధులకు హాజరును మీ ప్రమాణం ద్వారా నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశు సంరక్షణ, గర్భిణుల నమోదు, వైద్య పరీక్షలు, ఐరన్ మాత్రల పంపిణీని సక్రమంగా నిర్వహించాలన్నారు. సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ఈ సంజీవని, మానసిక ఆరోగ్యం, అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కుష్ఠ వ్యాధి ఉన్న చిన్నారులకు ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్న గర్భిణుల వివరాలను కూడా సేకరించి వందశాతం నమోదు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని సూచించారు.వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ లహరి, ఆరోగ్య పర్యవేక్షకులు రఘుపతి, పద్మ, ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్, మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి. ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.


సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# ఐబీఎస్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్న 18వ వార్షిక క్రీడా ఉత్సవం



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఐసీఎఫ్ఏఐ బిజినెస్ స్కూల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక వార్షిక క్రీడా వేడుక 18వ ఎడిషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐబీఎస్ హైదరాబాద్ అధికారిక క్రీడలు, ఫిట్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రీడా ఉత్సవం విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు జట్టుస్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కొనసాగనుంది. ఈ క్రీడా వేడుకలో మొత్తం 14 విభాగాల్లో ఇండోర్, అవుట్‌డోర్ పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్, మహిళల క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, టేబుల్ క్రికెట్, స్క్వాష్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్ తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకారం, సమష్టి కృషి, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ వేడుక చక్కటి వేదికగా నిలవనుంది.ఈ కార్యక్రమ నిర్వహణలో ఐబీఎస్ హైదరాబాద్ విద్యార్థి కార్యక్రమాల సమన్వయకర్త ప్రొఫెసర్ మాధవి గరికపర్తి సంస్థాగత మార్గదర్శకత్వం, పర్యవేక్షణ అందిస్తుండగా, క్రీడలు, ఫిట్‌నెస్ క్లబ్ మార్గదర్శకురాలు ప్రొఫెసర్ శ్వేతా సింగ్ విద్యార్థుల ప్రధాన కమిటీతో సమన్వయం చేసుకుంటూ పోటీల ప్రణాళిక, నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.ప్రొఫెసర్ మాధవి గరికపర్తి విద్యార్థి కార్యక్రమాల సమన్వయకర్త ప్రొఫెసర్ శ్వేతా సింగ్ -- క్రీడలు, ఫిట్‌నెస్ క్లబ్ మార్గదర్శకురాలు ఈ క్రీడా ఉత్సవం విద్యార్థుల్లో క్రీడా సంస్కృతిని బలోపేతం చేస్తూ, ప్రతిభ, స్నేహబంధం, ఐక్యతకు ప్రతీకగా నిలవనుంది.



## గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు నూతన హంగులు...

**రూ.10 లక్షలతో అభివృద్ధి చేసిన బసంతి ఫౌండేషన్...**

**క్రైమ్ మిర్రర్ గచ్చిబౌలి:** బసంతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అజయ్ రాయుడు నాయకత్వంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌ను రూ.10 లక్షల వ్యయంతో ఆధునికంగా తీర్చిదిద్దారు.ఫౌండేషన్ తరఫున పోలీస్ స్టేషన్‌లో పలు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. రిసెప్షన్ వెనుక ఉన్న మరుగుదొడ్లను తొలగించి వాటి స్థానంలో సబ్ ఇన్‌స్పెక్టర్లకు ప్రత్యేక క్యాబిన్లను ఏర్పాటు చేశారు. మొత్తం భవనానికి మరమ్మతులు, కొత్త రంగులు, పార్కింగ్ సదుపాయం అభివృద్ధి చేశారు.పోలీసు సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడంతో పాటు, స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఫౌండేషన్ తెలిపింది.ఈ అభివృద్ధి పనులను శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ సీ.ఐ. కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖకు సహకారం అందించిన బసంతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అజయ్ రాయుడు ని అభినందించారు.

## బీజేవైఎం రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీగా షాపురం శ్రీకాంత్

**ఘనంగా సన్మానించిన బండమీది వెంకటేష్**



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** బీజేవైఎం రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీగా షాపురం శ్రీకాంత్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా శనివారం బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు బండమీది వెంకటేష్ శాలువాతో సత్కరించి, భగవద్గీతను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధిస్తూ, ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ షాపురం మాణిక్యం, మల్లేష్ గౌడ్, బీసీ నాయకుడు సిరా సాయి పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయంలో ప్రాన్స్ పర్యాటకుడు



**వెంఃటాపూర్(రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 21:** మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం ప్రాన్స్ దేశానికీ చెందిన సివైన్ సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు బద్రు, శ్రీనివాస్, దశరథ్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న చలమల్ల కృష్ణారెడ్డి



**నల్లగొండ జిల్లా క్రైమ్ మిర్రర్:** చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పాలకూరి నాగరాజు గౌడ్ యొక్క ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరైన నూతన గృహప్రవేశ వేడుకలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి పాల్గొని ప్రారంభించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ నాయకులు మరియు మండల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు..

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 ఆదివారం 22-11-2026

# బీరంగూడలో రాజస్థానీ మార్వాడీ రుచులు

## ధాబా ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఈర్ల రాజు ముదిరాజ్



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 21:** పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన గోపి కిషన్ బాలాజీ ఫ్యామిలీ ధాబా ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధాబా నిర్వాహకుడు, తన ఆత్మీయ మిత్రుడు బాల కిషన్‌ను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. అనంతరం ధాబా వ్యాపారం విజయవంతంగా కొనసాగి దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. రాజస్థానీ మార్వాడీ సమాజానికి వ్యాపార రంగంలోనే కాకుండా కష్టపడి పనిచేసే తత్వం, క్రమశిక్షణ, ఆతిథ్యం అందించడంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తమ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకుంటూ స్థానిక ప్రజలతో కలిసిమెలిసి జీవిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్న మార్వాడీ సోదరుల సేవలు అభినందనీయమన్నారు. ఆహారం అనేది కేవలం ఆకలి తీర్చే సాధనం మాత్రమే కాదని, ఒక ప్రాంతపు సంస్కృతి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. రాజస్థానీ మార్వాడీ వంటకాల ప్రత్యేక రుచులను తెలుగు ప్రజలకు పరిచయం చేయడం సంతోషకరమన్నారు. స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన శాకాహార భోజనం, రుచికరమైన వంటకాలు, నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో బాల కిషన్ బాలాజీ ఫ్యామిలీ ధాబాను ప్రారంభించడం అభినందనీయమన్నారు. వ్యాపారంలో లాభాల కంటే ముందుగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించుకోవడం ముఖ్యమని, నాణ్యత, పరిశుభ్రత, మంచి రుచి, ఆప్యాయతతో కూడిన సేవలు అందిస్తే ప్రజల ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. బాలాజీ ఫ్యామిలీ ధాబా కేవలం భోజనశాలగా కాకుండా వివిధ ప్రాంతాల రుచులు, సంస్కృతులు కలిసే ఆత్మీయ వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో వ్యాపారం మరింత విస్తరించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఈ ప్రాంతమంతా బాలాజీ ఫ్యామిలీ ధాబా పేరు మారుమోగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తలారి నవీన్ ముదిరాజ్, మిత్రులు మనోహర్ చౌదరి, రతన్ చౌదరి తదితరులు పాల్గొని ధాబా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మందుల సామేలు శంకుస్థాపన

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** మండలంలోని అలుగునూరు, దిర్శనపల్లి, బిక్కుమళ్ళ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శ్రీకారం చుట్టారు. అలుగునూరు గ్రామంలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం అనంతరం గ్రామంలో ఉపాధి నిధులతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా దిర్శనపల్లి గ్రామంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం బిక్కుమళ్ళ లో గ్రామ సమైక్య భవనానికి శంకుస్థాపన చేసి ఇందిరమ్మ జీవిత బీమా పథకం దరఖాస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కుటుంబ పెద్ద కు ఏదైనా జరిగితే కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోసా అందించటానికి ఇంది రమ్మ జీవిత బీమా పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు.ఈనాటి కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్పర్సన్ నాగం జయసుదా సుధాకర్ రెడ్డి, అలుగునూరు సర్పంచ్ కాసా నరేందర్ యాదవ్, దర్శన పల్లి సర్పంచ్ పాండవుల లింగయ్య, బిక్కుమల్ల సర్పంచ్ రామసహాయం మమతా దేవి అనుప రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి, ఎంపీడీవో సునీత, తాసిల్దారు శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బీమా దరఖాస్తుల నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు

### అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల భరోసా

### క్యాతనపల్లిలో ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్



**రామకృష్ణాపూర్ నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం క్యాతనపల్లి పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డు అమరవాదిలో కమిషనర్ మురళీకృష్ణతో కలిసి ఆయన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కలుగుతుందని, జిల్లాలోని అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కుటుంబంలో 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తిని బీమా లబ్ధిదారునిగా ప్రతిపాదించాలని, ఆ వ్యక్తి స్వయంగా వచ్చి దరఖాస్తుపై సంతకం చేయడంతో పాటు నామినీ వివరాలను నమోదు చేసి అందజేయాలని పేర్కొన్నారు. నామినీ ఎంపిక విషయంలో లబ్ధిదారుల నుంచి భౌతికంగా సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దరఖాస్తులను తప్పుల్లేకుండా నింపి, ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: అదనపు కలెక్టర్ చంద్రయ్య

### క్యాతనపల్లి ఐదో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన తనిఖీ



**రామకృష్ణాపూర్ నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి శనివారం పరిశీలించారు.ఈసందర్భంగా పాఠశాల ఆవరణ, వంటగదిని తనిఖీ చేసి భోజనం తయారీ విధానం, నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి పాఠశాలలో అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం రుచిగా ఉంటున్నాయా? నాణ్యతగా వడ్డిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల సిబ్బంది, నిర్వాహకులకు సూచించారు.

## మృతుడి కుటుంబానికి ఎడ్మ సత్యం ఆర్థిక చేయూత

### ఎడ్మ కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.5 వేల సాయం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం. కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన ఓడల మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఎడ్మ సత్యం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎడ్మ కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, ఆపద సమయంలో అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహకారం అందించడం బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, ఉపసర్పంచ్ నిజాముద్దీన్, మాజీ సర్పంచ్ దేశం వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, పుల్లారెడ్డి, మదన్ మోహన్ రావు, ఓర్స రంగయ్య, పురం రాంరెడ్డి, దొక్క లింగం, ఓర్స రాములు, భోజిరెడ్డి, నాగేష్ గౌడ్, అయ్యన్న, వార్డు సభ్యులు కిషోర్, బాలరాజు, మల్లేష్, తిరుపతయ్య, శ్రీకాంత్, కడల శివ, గొడుగు శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తోపాజీ అనంత్ కిషన్ జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 21:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ జన్మదిన వేడుకలు సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు సందడిగా జరిగాయి. ఈ వేడుకలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోపాజీ అనంత్ కిషన్‌తో కేక్ కట్ చేయించి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తోపాజీ అనంత్ కిషన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణం అభిమానులు, పార్టీ శ్రేణుల సందడితో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జార్జ్, మహేష్ ముదిరాజ్, రమేష్, గంగేరి శ్రీహరి, కుమార్, కరంజీత్ సింగ్‌తో పాటు తోపాజీ అనంత్ కిషన్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం: అమీన్‌పూర్ తహశీల్దార్ వెంకటేశం

### ఐలాపూర్ తండాలో 50 బేస్‌మెంట్లు, 25 ఇళ్ల కూల్చివేత



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 21: ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించే చర్యల్లో భాగంగా అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ తండాలో శనివారం భారీగా కూల్చివేతలు నిర్వహించారు. అమీన్‌పూర్ తహశీల్దార్ వెంకటేశం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి ప్రభుత్వ భూముల్లో నిర్మించిన 50 బేస్‌మెంట్లతో పాటు 25 ఇళ్లను కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేశం మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించి తొలగించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎవరిపైనా ఉపేక్ష చూపబోమని స్పష్టం చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, అమీన్‌పూర్ మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ లో ఈ నెల 26 న "77 ఏళ్ల భారత రాజ్యాంగం" పై సెమినార్

### సీనియర్ జర్నలిస్టు, సర్పంచ్ బి. శ్రీహరికి ఆహ్వానం

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 21:** దళిత జర్నలిస్టుల ఫోరం (డీజేఎఫ్) హత్నూర మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న దౌల్తాబాద్‌లో నిర్వహించనున్న "77 ఏళ్ల భారత రాజ్యాంగం -- బహుజనుల స్థితిగతులు" అనే అంశంపై ప్రత్యేక సెమినార్‌కు హాజరుకావాలని గుండ్ల మాచనూరు గ్రామ సర్పంచ్ బి. శ్రీహరిని డీజేఎఫ్ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సెమినార్ నిర్వహణ ఉద్దేశాలు, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బహుజనులు, దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై నిర్వహించనున్న చర్చల వివరాలను ఆయనకు వివరించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 77 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బహుజనులు, దళితులు సాధించిన ప్రగతి, హక్కుల అమలు, నేటికీ ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించడమే ఈ సెమినార్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, బహుజనులు, దళిత సంఘాల నాయకులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో డీజేఎఫ్ రాష్ట్ర నాయకుడు మీనంపల్లి కిషన్ రావు, ఉమ్మడి



మెదక్ జిల్లా అధ్యక్షుడు ముక్కగల్ల యాదన్న, హత్నూర మండల అధ్యక్షుడు మద్దెల పోచన్న, మండల ప్రధాన కార్యదర్శి పరమేషుల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 22-11-2026
7

# కల్వకుర్తి క్రికెట్ టోర్నీలో సత్తా చాటిన 11 బుల్లెట్స్ జట్టు

## ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ఎఫ్ఎల్-1 టోర్నమెంట్.. విజేతకు రూ.25 వేల నగదు బహుమతి







క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్వకుర్తి నియోజకవర్గస్థాయి ఆర్ఎఫ్ఎల్-1 క్రికెట్ టోర్నమెంట్‌లో కల్వకుర్తి పట్టణానికి చెందిన 11 బుల్లెట్స్ జట్టు విజేతగా నిలిచింది. జీడిపల్లి జాగ్వార్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతగా నిలిచిన 11 బుల్లెట్స్ జట్టుకు రూ.25 వేల నగదు, ట్రోఫీని డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన జీడిపల్లి జట్టుకు రూ.15 వేల నగదు, ట్రోఫీని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అందించారు. వ్యక్తిగత విభాగంలో 11 బుల్లెట్స్ జట్టుకు చెందిన జిల్లు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డులు అందుకోగా, బెస్ట్ బౌలర్‌గా చింతకాయల శివ నిలిచారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు సరైన ప్రోత్సాహం, అవకాశాలు లేక తమ ప్రతిభను నిరూపించుకోలేకపోతున్నారని అన్నారు. ఇలాంటి టోర్నమెంటులు నిర్వహించడం వల్ల మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, వారి ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. క్రీడలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యత, స్నేహభావం, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్ల ద్వారా గ్రామీణ క్రీడాకారులకు మంచి వేదిక కల్పించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్ నిర్వహించిన ఆర్ఎస్పీ ఫౌండేషన్ నిర్వాహకులను పలువురు అభినందించారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫామ్స్ కొనుగోలుకు ఓపెన్ టెండర్లు

### నవంబర్ 23 నుంచి 27 వరకు టెండర్ల స్వీకరణ



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్‌కర్నూల్):** నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పీఎం శ్రీ హబ్ అండ్ స్పోక్ మోడల్ కింద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం అమలులో భాగంగా యూనిఫామ్స్ కొనుగోలుకు ఓపెన్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్ కుమార్ తెలిపారు.. స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో పాటు స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు అవసరమైన యూనిఫామ్స్ సరఫరా చేసేందుకు ఆసక్తి కలిగిన అర్హతగల సంస్థలు, ఫర్మ్‌లు నవంబర్ 23 నుంచి 27వ తేదీ వరకు టెండర్లు సమర్పించవచ్చని పేర్కొన్నారు.టెండర్లకు సంబంధించిన పూర్తి వివరాలు, యూనిఫామ్‌ల స్పెసిఫికేషన్లు, సరఫరా నిబంధనలు, ఇతర సమాచారాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. అర్హత కలిగిన సంస్థలు నిర్ణీత గడువులోగా టెండర్లు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు.

## సంగారెడ్డి జిల్లాలో 11 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తుల సమర్పణ

### 27న ఎంపిక ప్రక్రియ



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 21: సంగారెడ్డి జిల్లాలోని ఐటీఐలు, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఖాళీగా ఉన్న 11 ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవి కిరణ్ రెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హత్నూర, పటాన్‌చెరు, సంగారెడ్డి ఐటీఐలతో పాటు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో 3 ఆఫీస్ సబార్డినేటర్లు, 3 స్వీపర్లు, 3 వాచ్‌మెన్ పోస్టులు, కాంట్రాక్ట్ విధానంలో 2 మల్టీపర్పస్ వర్కర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.15,600 వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులతో పాటు స్వీయ ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని జి-బ్లాక్‌లో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఈ నెల 27వ తేదీన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన, విద్యార్హతల ధ్రువీకరణ, రాత పరీక్ష తదితర ప్రక్రియల ద్వారా అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నట్లు తెలిపారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర సమాచారం కోసం సంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవి కిరణ్ రెడ్డి సూచించారు.

## కాటేదాన్ టీఎన్జీఓస్ కాలనీలో అయ్యప్ప అన్నదాన కార్యక్రమం ప్రారంభం

### 41 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో కాటేదాన్ టీఎన్జీఓస్ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్ర అన్నదాన కార్యక్రమం నేటి నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. వరుసగా 41 రోజుల పాటు ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తులకు అన్నప్రసాదం అందించాలనే సంకల్పంతో సేవా సమితి సభ్యులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భక్తితో పాటు సేవాభావాన్ని చాటేలా నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రతిరోజూ భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంతో పుణ్యకార్యమని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులందరూ ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు గురు స్వామి ప్రమోద్ రెడ్డి, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ధనంజయ, టి ప్రేమ్ గౌడ్, కళ్లెం లక్ష్మారెడ్డి, కోట పవన్ కుమార్ స్వామి, జగదీష్, సారంగా రవి, తదితరులు పాల్గొన్నారు...

## రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి అజయ్

### జిల్లాస్థాయి ఎలక్టోరల్ లిటరసీ క్విజ్‌లో ప్రతిభ

### విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేసి అభినందించిన జిల్లా అధికారులు



**వనపర్తి, నవంబర్ 21 క్రైమ్ మిర్రర్:** ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన కంచిరావుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఆర్. అజయ్‌ను జిల్లా అధికారులు అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థి అజయ్‌కు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రామిరెడ్డి, ఆర్డీఓ సుబ్రమణ్యం, డీఐఈఓ ఐలయ్య, డీవైఈఓ సుధీర్ రెడ్డి, డీఎస్ఓ శ్రీనివాసులు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.జిల్లాస్థాయిలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి గర్వకారణమని పలువురు ప్రశంసించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో విద్యార్థికి మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు పి. శ్రీనివాస్ గౌడ్‌ను కూడా అభినందించారు.

## ఉప్పర్‌పల్లిలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం

### అర్హులైన కుటుంబాలకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఆపద సమయంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఉప్పర్‌పల్లిలో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన రశీదును దరఖాస్తుదారునికి ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ స్వయంగా అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు భరోసా కల్పించే ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఎ. సదాలక్ష్మి, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ లోకపెద్ద మల్లారెడ్డి, సామా ఇంద్రపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాపర్ కోసం వైర్లు కాలుస్తూ... ప్రజల ఆరోగ్యంతో చెలగాటం!

### మునుగోడు,లక్ష్మీదేవిగూడెంలో విషవాయువుల కలకలం!

### జంగాల కాలనీలో వైర్లు కాల్చడంతో విషపూరిత పొగ..

### ప్రజల్లో భయాందోళన




**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడెం జంగాల కాలనీలో వెలువడుతున్న విషపూరిత పొగ స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పాత ఇనుప సామగ్రిని కొనుగోలు చేస్తూ జీవనం సాగించే కొందరు జంగాల కాలనీ వాసులు, కరెంట్ వైర్లలోని రాగి (కాపర్) తీగలను వేరు చేసుకునేందుకు వైర్లను కాలుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ క్రమంలో వైర్లు కాల్చే సమయంలో వెలువడుతున్న దట్టమైన పొగ, దుర్వాసన పరిసర ప్రాంతాలకు వ్యాపిస్తోంది. సుమారు అర కిలోమీటరు పరిధి వరకు దుర్వాసన వ్యాపించడంతో లక్ష్మీదేవిగూడెం ప్రజలు, గ్రామ పంచాయతీ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళల ఆరోగ్యంపై ఈ పొగ ప్రభావం చూపుతుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విషపూరిత పొగతో వాతావరణం కలుషితమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య సమస్యను వెంటనే గుర్తించి, వైర్లు కాల్చే చర్యలను అరికట్టాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జంగాల కాలనీలో జరుగుతున్న కాలుష్యానికి అడ్డుకట్ట వేసి, లక్ష్మీదేవిగూడెం ప్రజలకు ,మునుగోడు ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా: ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

### లక్షెట్టిపేట 2వ వార్డులో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



**లక్షెట్టిపేట నవంబర్21 (క్రైమ్ మిర్రర్):** పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శనివారం స్వయంగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశంతో రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని పేర్కొన్నారు.

## తెల్ల రేషన్ కార్డు దారులందరు ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోండి

### రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని 29 డివిజన్ లలో 58 నమోదు కేంద్రాలు

### 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులు

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కోసం తెల్ల రేషన్ కార్డు ఉండి అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. అందుకోసం జోన్ పరిధిలోని 29 డివిజన్ల లో 58 నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజన్ కు రెండు చొప్పున నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇవి కాక మీ సేవ కేంద్రాలలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉండి కుటుంబంలో ఒకరు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా దరఖాస్తు దారునికి ఏదైనా సంభవిస్తే రూ. 5 లక్షల బీమా చెల్లించడం జరుగుతుందని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డిసెంబరు 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 ఆదివారం 22-11-2026



## కొత్వాల్‌గూడలో రూ.400 కోట్ల విలువైన భూమిపై ప్రైవేటు వ్యక్తుల కన్ను

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు బీఆర్ఎస్ పోరుబాట



గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని కొత్వాల్‌గూడ 119వ డివిజన్‌లో ప్రభుత్వ, హెచ్ఎండీఏ భూముల ఆక్రమణ యత్నాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. కొత్వాల్‌గూడ పరిధిలోని సర్వే నంబర్ 626/1లో ఉన్న ప్రభుత్వ, హెచ్ఎండీఏ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ 119వ డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.400 కోట్లు ఉంటుందని, ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే కొంత భూమిని ఆక్రమించారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆక్రమణకు గురైన భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, మిగిలిన భూమికి హద్దులు ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షులు మురళి గౌడ్, హరికృష్ణ, గూడెపు అశోక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు జివిపి సాగర్, దీపక్ గౌడ్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శివ, శ్యామ్, సోషల్ మీడియా ప్రతినిధి రోహిత్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పేదల కష్టాల్లో అండగా ఉంటాం.. కుటుంబానికి భరోసా కల్పిస్తాం

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎస్. వెంకటేష్



గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రజల సంతోషంలోనే కాకుండా, ఆపద సమయంలోనూ వారికి అండగా నిలవడమే నిజమైన నాయకత్వమని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,ఎస్. వెంకటేష్ అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ నిరుపేద కార్మికుడిని పరామర్శించి, అతని కుటుంబానికి ధైర్యం చెప్పి మానవత్వాన్ని చాటుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్‌కు చెందిన శివ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత ఐదు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్. వెంకటేష్ వెంటనే స్పందించి తన అనుచరులు, మిత్రులతో కలిసి ఆసుపత్రికి వెళ్లి శివను పరామర్శించారు. ఈ సందర్భంగా శివ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. శివ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తానని తెలిపారు. ప్రజల సంతోషంలోనే కాకుండా వారి కష్టసుఖాల్లోనూ భాగస్వాములై, ఆపద సమయంలో తోడుగా ఉండటమే తన లక్ష్యమన్నారు. శివ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శివ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ శంకర్, ఎలక్ట్రీషియన్ రాజ్ కుమార్, మిల్లర్ నరసింహతో పాటు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీబీఐటీలో భాషిణి బహుభాషా ఏఐ సాంకేతికతల ప్రదర్శన

### భారతీయ భాషల్లో డిజిటల్ సేవలకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం.. . విద్యార్థులు, పరిశోధకులకు అవగాహన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** భారతీయ భాషల మధ్య సమాచార మార్పిడిని సులభతరం చేయడంతో పాటు, ప్రజలకు మాతృభాషలోనే డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భాషిణి కార్యక్రమం ఆధునిక కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతలను ప్రదర్శించింది. గండిపేటలోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో నిర్వహించిన రెండవ ప్రాంతీయ ఇంజినీరింగ్‌లో నూతన ధోరణుల సదస్సు లో భాషిణి ప్రత్యేక ప్రదర్శన స్టాల్‌ను ఏర్పాటు చేసి తన సాంకేతిక పరిజ్ఞానాన్ని సందర్శకులకు పరిచయం చేసింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న డిజిటల్ ఇండియా భాషిణి విభాగం ఈ ప్రదర్శనను నిర్వహించింది. జాతీయ భాషా అనువాద మిషన్ లక్ష్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, భాషా అడ్డంకులను తొలగించి ప్రభుత్వ సేవలు, సమాచారాన్ని దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు వారి మాతృభాషల్లో అందించేందుకు ఏఐ ఆధారిత సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయో వివరించారు. ఈ ప్రదర్శనలో మెషిన్ ట్రాన్స్‌లేషన్, ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్, టెక్స్ట్ టు స్పీచ్, లిప్యంతరీకరణ, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ప్రభుత్వ పాలన, వ్యవసాయం, వైద్యం, విద్య, ప్రజాసేవలు, పౌరుల భాగస్వామ్యం వంటి కీలక రంగాల్లో బహుభాషా కృత్రిమ మేధస్సు వినియోగాన్ని వివరించారు. ప్రదర్శనలో భాగంగా న్యాయ సేవలకు సంబంధించిన సమాచారాన్ని వివిధ భారతీయ భాషల్లో ప్రజలకు అందించేందుకు ఉపయోగపడే 'న్యాయ సేతు' అప్లికేషన్‌ను పరిచయం చేశారు. భాషల మధ్య అనువాదం, సమాచార మార్పిడికి ఉపయోగపడే భాషిణి మొబైల్ అప్లికేషన్ పనితీరును వివరించారు. సందర్శకులు తమ మొబైల్ ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ప్రత్యేకతలను స్వయంగా పరీక్షించారు. వ్యవసాయ రంగంలో రైతులకు భాషా పరమైన అడ్డంకులు లేకుండా సమాచారం అందించేందుకు రూపొందించిన 'భారత్ విస్తార్' సాంకేతిక వేదికను ప్రదర్శించారు. పౌరుల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను





సులభతరం చేసే సీపీజీఆర్ఏఎంఎస్ వ్యవస్థలో బహుభాషా సాంకేతికతల ప్రాధాన్యతను వివరించారు. అదేవిధంగా మాట్లాడిన మాటలను లిఖిత రూపంలోకి మార్చే 'శ్రుతలేఖ్' స్పీచ్ టు టెక్స్ట్ సాంకేతికతను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ప్రసంగాల లిఖితీకరణ, బహుభాషా సమాచార మార్పిడి, దివ్యాంగులకు డిజిటల్ సేవలను మరింత చేరువ చేయడంలో ఈ సాంకేతికత ఉపయోగాలను తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు, పౌర సేవలకు సంబంధించిన వివరాలను సంభాషణ రూపంలో అందించే 'మేరీ యోజన చాట్‌బాట్'తో పాటు, భారతీయ భాషలకు సంబంధించిన డేటా అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే 'భాషాదాన్' కార్యక్రమాన్ని కూడా పరిచయం చేశారు. ప్రజలు తమ మాటలు, పాఠ్య సమాచారాన్ని అందించడం ద్వారా దేశంలో భాషా సాంకేతికత అభివృద్ధికి సహకరించవచ్చని వివరించారు. భాషిణి ప్రదర్శన స్టాల్‌ను పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు సందర్శించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిన్న వీరభద్రుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ ఏ.డి. శర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్యామ్ సుందర్, చెస్ రిటైర్డ్ అసోసియేట్ డైరెక్టర్ పి. రాఘవేంద్రరావు, స్పీకర్ట్.ఏఐ ప్రిన్సిపల్ రీసెర్చ్ ఇంజినీర్ డాక్టర్ ఎన్. జగన్మోహన్, కమిట్ కంట్రోల్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. రాంబాబు ప్రదర్శనను పరిశీలించారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె. వసంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్‌సీఈటీఈ సమన్వయకర్త డాక్టర్ టి. శ్రీధర్, ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ జి.ఎన్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాషిణి సాంకేతికతల పనితీరు, భవిష్యత్తులో వివిధ రంగాల్లో వాటి వినియోగ అవకాశాలపై నిర్వాహకులు ప్రముఖులకు వివరించారు. సదస్సుకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో భాషిణి స్టాల్‌ను సందర్శించి వివిధ అప్లికేషన్ల పనితీరును ఆసక్తిగా తెలుసుకున్నారు. సందర్శకుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకంగా భాషిణి సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. మొబైల్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బహుభాషా సౌకర్యాలను ప్రత్యక్షంగా వినియోగించుకునేలా ప్రోత్సహించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ, ప్రతి పౌరుడికి తనకు ఇష్టమైన భాషలో డిజిటల్ సేవలను చేరువ చేయడంలో భాషిణి కీలక పాత్ర పోషిస్తోందని ఈ ప్రదర్శన ద్వారా వెల్లడైంది. భవిష్యత్తులో విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రభుత్వ సేవలు సహా అనేక రంగాల్లో భాషా ఆధారిత కృత్రిమ మేధస్సు సాంకేతికతలు విస్తృతంగా ఉపయోగపడే అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు.

---

# ఆపద సమయంలో నిరుపేద కుటుంబాలకు కొండంత అండ

### అర్హులందరూ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఇందిరమ్మ జీవిత బీమా

### పథకాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి, నవంబర్ 21 క్రైమ్ మిర్రర్:** పేద కుటుంబాలకు అనుకోని ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకం నిరుపేదలకు అండగా నిలవనుందని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.శనివారం పెబ్బేరు మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, కౌన్సిలర్ జములమ్మ, మున్సిపల్ కమిషనర్ గణేష్‌తో కలిసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా ఇందిరమ్మ జీవిత బీమా పథకం కొండంత భరోసా కల్పిస్తుందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి



ఒక్కరికీ చేరవేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను తక్షణమే నమోదు చేసుకొని ఈ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.వార్డుల అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి గడపకూ చేర్చేందుకు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కురుమూర్తి, సునీల్ రెడ్డి, వార్డు ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

### వరుసగా ఢీకొన్న నాలుగు కార్లు.. పలువురికి తీవ్ర గాయాలు

### ఇద్దరి పరిస్థితి విషమం.. మరో ఇద్దరికి కాళ్లు ఫ్రాక్చర్

### బ్లాస్టింగ్ పనుల వద్ద ట్రాఫిక్ అంతరాయమే ప్రమాదానికి కారణమా?

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ సమీపంలోని ఈకో పార్కు పక్కన నాలుగు కార్లు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి కాళ్లు ఫ్రాక్చర్ కాగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజేంద్రనగర్ ఓఆర్ఆర్‌పై ఈకో పార్కు సమీపంలో బ్లాస్టింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న వాహనాలు ఒక్కసారిగా నెమ్మదించడంతో కొన్ని కార్లు రహదారిపై నిలిచిపోయాయి. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ముందున్న కారును బలంగా ఢీకొట్టింది. దీంతో వరుసగా వెళ్తున్న నాలుగు కార్లు ఒకదానికొకటి ఢీకొని భారీగా దెబ్బతిన్నాయి. నాలుగు కార్లు బలంగా ఢీకొనడంతో వాహనాల ముందు, వెనుక భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాద తీవ్రతకు కొందరు ప్రయాణికులు కార్లలోనే ఇరుక్కుపోయారు. పలువురికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడ ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి కార్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ఇద్దరికి కాళ్లు ఫ్రాక్చర్ కాగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

**రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్...**

ఈ ప్రమాదంతో ఓఆర్ఆర్‌పై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు రెండు



కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరడంతో శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో కొంతసేపు రహదారిపై గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. దెబ్బతిన్న వాహనాలను రహదారి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. ఓఆర్ఆర్‌పై బ్లాస్టింగ్ పనులు జరుగుతున్న సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటం, వాహనాలు ఒక్కసారిగా నెమ్మదించడం ఈ ప్రమాదానికి దారితీసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. నిర్మాణ పనులు జరిగే ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక బోర్డులు, తగిన ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు ఏర్పాటు చేశారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. బ్లాస్టింగ్ పనుల నిర్వహణలో నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణంలోనూ సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. అయితే ప్రమాదానికి అసలు కారణాలు, బాధ్యులెవరనే విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఓఆర్ఆర్‌పై ప్రయాణించే వాహనదారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్మాణ పనులు జరిగే ప్రాంతాల్లో పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# బ్లాస్టింగ్‌తో అపార్ట్‌మెంట్లకు నష్టం.. పట్టించుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదు

## లాన్సమ్ ప్రాజెక్ట్స్ నిర్మాణ పనులపై స్థానికుల ఆందోళన

## బాధిత నివాసితులకు అండగా ఉంటాం.. ప్రజల భద్రత విషయంలో రాజీ లేదు

## నెక్కనంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ మెరుగు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అభివృద్ధి పనుల పేరుతో నివాస ప్రాంతాల్లో చేపడుతున్న భారీ నిర్మాణ పనులు స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని, నిర్మాణ సంస్థల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం వాటిల్లితే సహించేది లేదని నెక్కనంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ మెరుగు హెచ్చరించారు. పుప్పాలగూడ రోడ్ నంబర్ 13లో లాన్సమ్ ప్రాజెక్ట్స్ చేపడుతున్న నిర్మాణ పనుల్లో బ్లాస్టింగ్ కారణంగా సమీపంలోని అపార్ట్‌మెంట్లు దెబ్బతిన్నాయన్న ఫిర్యాదులపై ఆయన స్పందించారు. ఈ మేరకు బ్లాస్టింగ్ ప్రభావానికి గురైనట్లు నివాసితులు పేర్కొంటున్న ట్విన్ డైమండ్స్, ఎస్ఎస్‌డీ వై3, కోనిఫర్స్ అపార్ట్‌మెంట్లను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. ఆయా అపార్ట్‌మెంట్ల నివాసితులతో సమావేశమై నిర్మాణ పనుల కారణంగా ఏర్పడిన నష్టాలు, భవనాలకు కలుగుతున్న ప్రకంపనలు, తాము ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నివాసితులు తమ ఆందోళనలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం లాన్సమ్ ప్రాజెక్ట్స్ ఎండీ, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించినట్లు జితేందర్ మెరుగు తెలిపారు. భారీ స్థాయిలో బ్లాస్టింగ్ పనులు ఇకపై చేపట్టబోమని, చుట్టుపక్కల నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని నిర్మాణ సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే గత కొన్ని వారాలుగా ఇదే తరహా హామీలు ఇస్తున్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయని అపార్ట్‌మెంట్ల నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేవలం హామీలతో సమస్య పరిష్కారం కాదని, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని నిర్మాణ సంస్థను, సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా జితేందర్ మెరుగు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్మాణ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బాధిత అపార్ట్‌మెంట్లకు జరిగిన నష్టంపై సమగ్ర పరిశీలన జరిపించి, నివాసితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే స్థానిక నివాసితులతో కలిసి ప్రజా ఉద్యమం చేపడతామని, రోడ్లపై బైఠాయించి అయినా సమస్య పరిష్కారం కోసం పోరాడతామని అన్నారు. ఈరోజు నిర్మాణ సంస్థ ప్రతినిధులు, అధికారులతో జరిగిన చర్చల ద్వారా సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా బాధిత కుటుంబాలకు అండగా నిలబడి వారి తరఫున పోరాడతానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు ప్రజలకు మేలు చేయాలే తప్ప, నివాసితులకు నష్టం కలిగించేలా ఉండకూడదని పేర్కొన్నారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని జితేందర్ మెరుగు స్పష్టం చేశారు.

# జల సంరక్షణకు హెచ్‌సీసీబీ--హెచ్‌ఎండీఏ కీలక భాగస్వామ్యం

## ఓఆర్ఆర్ వెంబడి పచ్చదనం పెంపునకు రోజుకు 600 కిలోలీటర్ల శుద్ధి చేసిన నీటి సరఫరా

## తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గిస్తూ సుస్థిర పట్టణ హరితీకరణకు చర్యలు

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): నగరంలో జల సంరక్షణతో పాటు పట్టణ హరితీకరణను మరింత విస్తరించే దిశగా హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెం ట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) సంయుక్తంగా కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెంబడి మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధికి శుద్ధి చేసిన వ్యర్థజలాలను పునర్వినియోగించుకునేలా ఈ భాగస్వామ్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ ప్రాంతంలోని గుర్తించిన ఓఆర్ఆర్ మార్గంలో పచ్చదనం అభివృద్ధి, మొక్కల నిర్వహణ కోసం హెచ్‌సీసీబీ తన అవిన్యా ప్లాంట్ నుంచి రోజుకు గరిష్ఠంగా 600 కిలోలీటర్ల శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనుంది. ఈ నీటిని బహుళ దశల్లో శుద్ధి చేయడంతో పాటు, నాణ్యతా పరీక్షలు నిర్వహించి, నిర్దేశిత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఈ నీటిని కేవలం తాగునీటియేతర అవసరాలకే వినియోగించనున్నారు. శుద్ధి చేసిన నీటిని ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా హెచ్‌ఎండీఏ నిర్దేశించిన స్వీకరణ కేంద్రానికి తరలిస్తారు. అక్కడి నుంచి తగిన నీటిపారుదల, పంపిణీ వ్యవస్థల ద్వారా ఓఆర్ఆర్ వెంబడి ఉన్న మొక్కలు, హరిత ప్రాంతాల నిర్వహణకు వినియోగిస్తారు. తద్వారా మొక్కలకు నిరంతర నీటి సరఫరా అందించడంతో పాటు, పచ్చదనం పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి అవసరాలు, భూగర్భ జలాల వినియోగం నేపథ్యంలో శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించుకోవడం ఎంతో కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో హెచ్‌సీసీబీ--హెచ్‌ఎండీఏ భాగస్వామ్యం ద్వారా తాగునీటి వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడనుంది. ఓఆర్ఆర్ పరిసరాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. ఈ సందర్భంగా హెచ్‌ఎండీఏ పట్టణ అటవీ విభాగం డైరెక్టర్, బీపీపీ ఓఎస్‌డీ (ఇన్‌చార్జి) రోహిత్ గోపిడి, ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ పరిధిలో హరిత ప్రాంతాలను విస్తరించడం, ఇప్పటికే ఉన్న పచ్చదనాన్ని పరిరక్షించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హెచ్‌సీసీబీతో కుదిరిన ఈ భాగస్వామ్యం ద్వారా హెచ్‌ఎండీఏ నిర్వహణలోని హరిత ప్రాంతాలకు అవసరమైన నీటిని ప్రత్యామ్నాయ వనరుల నుంచి సమకూర్చుకునే అవకాశం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని మరింత పచ్చగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి వినూత్న కార్యక్రమాలు ఎంతో అవసరమని, జల సంరక్షణతో పాటు సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని ఆయన వెల్లడించారు.

# కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఇందిరమ్మ రూ.5 లక్షల బీమా పథకం ప్రారంభం

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

## కాంగ్రెస్ నాయకులు ఎన్. ధనుంజయ, టి. ప్రేమ్ గౌడ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ రూ. 5 లక్షల బీమా పథకాన్ని కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబుల్‌రెడ్డినగర్, శ్రీరాంనగర్, పద్మశాలిపురం, లక్ష్మీగూడ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులకు పథకంపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, టి. ప్రేమ్ గౌడ్ మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి, 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని, అలాంటి కుటుంబాలకు ఇందిరమ్మ రూ. 5 లక్షల బీమా పథకం అండగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు భవిష్యత్తుపై భరోసా కల్పించే ఈ పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి అర్హులైన కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హత ఉన్నవారు ప్రత్యేక



కేంద్రాలను సంప్రదించి పథకానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, టి. ప్రేమ్ గౌడ్, సోమ శ్రీనివాస్ గుప్తా, మాసున్నవెంకటేష్ నేత, సరికొండ వెంకటేష్, దత్తు నేత, బొల్లా వెంకటేష్ నేత, కాశిగారి యాదగిరి నేత, జగదీష్, సోమ సందీప్ నేత, కళ్లెం లక్ష్మారెడ్డి, కోట పవన్ కుమార్ నేత,ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, ఎల్లప్ప, యాంజల మహేశ్ రాజు నేత, యాంజల శేఖర్ నేత, గంజి వెంకటేష్ నేత, కృష్ణ, రాము, నాని, రాజు ముదిరాజ్, మన్యం రెడ్డి, స్వామి గౌడ్, విజయ్ కుమార్, అర్జున్, లావణ్య, అశ్విని, సునీత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకానికి అర్హులు

## మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్ గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్




క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకానికి అర్హులేనని,18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవచ్చని వారు సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులచే కంప్యూటర్లు ఏర్పాటు చేయించి లబ్ధిదారులకు ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అందుకే ప్రతి ఒక్కరు కుటుంబ యజమానిపై బీమా చేయించుకోవడం ఎంతో అవసరమని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇప్పాయిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ఎండి అయూబ్, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

## కొక్కిరాల సురేఖ జన్మదినం సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేత

**మంచిర్యాల నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ కోచింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సతీమణి కొక్కిరాల సురేఖ జన్మదినోత్సవం సందర్భంగా మరికొంతమంది అభ్యర్థులకు ఈ మెటీరియల్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత పోలీస్ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన నాణ్యమైన శిక్షణ, స్టడీ మెటీరియల్ అందించడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఎస్సై, కానిస్టేబుల్ కొలువులు సాధించి తమ తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ, సమయపాలన ఎంతో కీలకమని తెలిపారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో ముందుకు సాగితే తప్పకుండా విజయం సాధించవచ్చని దిశానిర్దేశం చేశారు.రాబోయే పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థుల సన్నద్ధతను అంచనా వేసేందుకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ కన్వీనర్ శరత్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలి

- **దళిత మహిళపై దాడి అమానవీయం..**
- **ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి**
- **వనస్థలిపురం వీరంనెర్రులో జీహెచ్ఎంసీ కార్మికుల నిరసన**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడికి పాల్పడిన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న దళిత మహిళ చందుపట్ల రమణ (45)పై బాలకృష్ణ అనే వ్యక్తి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, వనస్థలిపురంలోని శ్రీ వీరం చెరువు వద్ద పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ బండ్లగూడ జాగీర్ అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ.. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 45వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న చందుపట్ల రమణ చెత్త సేకరిస్తున్న సమయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ట్రాక్టర్‌పై నిలబడి చెత్తను తీసుకునే క్రమంలో ఇసుకతో నిండిన బస్తాను పైకి ఎత్తలేకపోవడంతో ఆగ్రహానికి గురైన బాలకృష్ణ ఆమెను కులం పేరుతో దూషిస్తూ, అసభ్య పదజాలంతో అవమానించడమే కాకుండా సెంట్రింగ్ కర్రతో కాళ్లపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు ఆరోపించారు. పక్కనే ఉన్న స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ నిందితుడు వెనక్కి తగ్గకుండా తిరిగి దాడికి ప్రయత్నించడం అత్యంత దారుణమని సుభాష్ ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ కూలీ పనిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న పేద దళిత మహిళపై ఇంతటి దాడికి పాల్పడటం అమానవీయమని అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించకుండా, వారిని చిన్నచూపు చూస్తూ దాడులకు పాల్పడటం సహించరాని విషయమని పేర్కొన్నారు. బాధితురాలిని కులం పేరుతో దూషించడంతో పాటు, నిందితుడి తల్లి కూడా అవమానకరమైన పదజాలంతో దుర్భాషలాడినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, ప్రధాన నిందితుడితో పాటు దూషణలకు పాల్పడిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని, బాధితురాలికి మెరుగైన వైద్యం, తగిన భద్రత కల్పించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రజారోగ్యం కోసం ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని, అలాంటి కార్మికులపై దాడులు జరిగితే విధి నిర్వహణలో భయాందోళనలు నెలకొంటాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో భారతమ్మ, కమలమ్మ, సుజాత, అనిత, ఈశ్వరమ్మ, జయమ్మ తదితర పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని బాధితురాలికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 ఆదివారం 22-11-2026



## నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలి

**కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.42 వేలు అమలు చేయాలి**

**డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి**

**సీఐటీయూ నాయకురాలు కే. కవిత**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, దేశంలోని కార్మికులందరికీ నెలకు కనీస వేతనం రూ.42 వేలు అమలు చేయాలని సీఐటీయూ గండిపేట్ మండల నాయకురాలు కే. కవిత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల పెంపు తదితర డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీలలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కార్మికులు దశాబ్దాల పాటు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కోడ్స్ అమలుతో కార్మికుల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని గంటలు, సామాజిక భద్రత వంటి కీలక హక్కులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల సంక్షేమం కంటే యాజమాన్యాల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో పేద కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్యం, ఇంటి అద్దెలు తదితర ఖర్చులను భరించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి కార్మికుడికి నెలకు కనీసం రూ.42 వేల వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన గళాన్ని వినిపించాలని కోరారు. కార్మికుల ఐక్యతే వారి హక్కులకు అసలైన రక్షణ అని, సంఘటిత పోరాటాల ద్వారానే న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడం సాధ్యమవుతుందని కవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంజి, వెంకటయ్య, రాములు, శ్రీనివాసులు, చెన్నయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ జీవిత భీమా కుటుంబానికి ధీమా

**పిఏసిఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ ఏఏంసి చైర్మన్ బిఎస్ ఆంజనేయులు**





క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ఇందిరమ్మ జీవిత భీమా పథకం కుటుంబాలకు ధీమా పథకం అని కుల్కచర్ల పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో శనివారం ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ ఎర్రం పోటీ మల్లేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు అందిస్తుందని స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కూడా ప్రజల గురించి ప్రజల సంక్షేమం గురించి ఆలోచన చేసే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక కాంగ్రెస్ ప్రభుత్వమేనని వారు సూచించారు. పేదలకు ఇందిరమ్మ ఇల్లు ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు పై సన్న బియ్యం అందించడం జరుగుతుందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్, పంచాయతీ కార్యదర్శి ఎండి అయూబ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుల్కచర్ల మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, ఇప్పాయిపల్లి మాజీ సర్పంచ్ బొలుసని బాల్రెడ్డి, ఉప సర్పంచ్ వడ్డె లక్ష్మి వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రామచంద్రయ్య, బోయిని కృష్ణయ్య,సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు అమృతయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కుంపల్లి నర్సింలు,వార్డు సభ్యులు వెన్నచేటి ఆంజనేయులు, కామారం ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదినం మాకు పెద్ద పండగ దినం

**జ్ఞాన శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంచన్‌పల్లి ఆనంద్**




క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్ అధికారి పుట్టినరోజు మాకు పండుగ రోజు అని జ్ఞాన శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంచంపల్లి ఆనంద్ సూచించారు.వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చిల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జ్ఞాన శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ నెల నవంబర్ 23న డా ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రపరిచి, మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంచన్‌పల్లి ఆనంద్ మాట్లాడుతూ.. డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ బహుజన బిడ్డలందరికీ ఆదర్శప్రాయడని,ఆయన విద్యా సేవలు ఎన్నో పేద కుటుంబాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఏఎస్ అధికారులుగా, న్యాయవాదులుగా, కాంట్రాక్టర్లుగా వివిధ రంగాల్లో స్థిరపడేందుకు ఆయన అందించిన విద్యా ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉన్నత విద్య అనేది పేద, బహుజన కుటుంబాలకు అందని ద్రాక్షలా ఉండేదని, అలాంటి కుటుంబాల పిల్లలు సైతం ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల్లో చదివేలా గురుకుల విద్యా వ్యవస్థ ద్వారా ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు.ఐపీఎస్ అధికారిగా దేశానికి సేవలందించడంతో పాటు గురుకులాల కార్యదర్శిగా ఉన్న సమయంలో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేశారు. మాలావత్ పూర్ణ అనే చిన్న వయసు బాలిక ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేలా ప్రోత్సహించడం ఆయన విద్యా దార్శనికతకు నిదర్శనమని అన్నారు.డా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదినం మాకు కేవలం ఒక పుట్టినరోజు వేడుక మాత్రమే కాదు.. బహుజన సమాజానికి ఒక పండగ. ఆయన ఆశయాలు, ఆలోచనా విధానం, సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మేము అందించే నిజమైన జన్మదిన కానుక. ఆయన స్ఫూర్తితోనే సమాజానికి ఉపయోగపడే విధంగా మూడు రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని మంచన్‌పల్లి ఆనంద్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో చిల్లాపూర్ గ్రామ సర్పంచ్ మహేష్,సోషల్ మీడియా వారియర్స్ మక్తల సింగం, నవీన్, యధిరం, శ్రీకాంత్, నరేష్, సురేష్, వల్లి, ఆంజనేయులు, శ్రీనివాస్, నరహరి తదితరులు పాల్గొన్నారు.



## పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులకు ఆశీర్వాదం

**సుగూరు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆప్యాయ పలకరింపులు**


**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**పెబ్బేరు, నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సుగూరు గ్రామంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పర్యటించి సందడి చేశారు. గ్రామంలో నిర్వహించిన పలు వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి నూతన జీవితాలు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**బండ్ల ఎద్దులకు నామకరణం చేసిన మాజీ మంత్రి:** అనంతరం సుగూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సాకలి పురేందర్‌కు చెందిన బండ్ల ఎద్దులను మాజీ మంత్రి సందర్శించారు. వాటికి ప్రత్యేకంగా నామకరణం చేసి కార్యకర్తను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వనం రాములు, గ్రామ సర్పంచ్ యాదమ్మ పరశురామ్, సర్పంచ్ విజయ్ గౌడ్, వడ్డే రమేష్, శ్రీను, పులి, రాముడు, గంగాధర్, యూత్ నాయకులు, అద్వానీ, నగేష్, దశరథ్, రాజు తదితరులు, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం


**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎన్.వి. సుబ్బారావు**



**క్రైమ్ మిర్రర్,పాలకీడు :** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నూతన పింఛన్ ప్రొసీడింగ్ పత్రాలను మండల అధికారులు,మండల తహసీల్దార్ వాజీద్ ,గ్రామ సర్పంచ్ కేలవత్ కవిత వార్డు నెంబర్ల తో కలిసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.వి. సుబ్బారావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.వి. సుబ్బారావు మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చేయూత పింఛన్లు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పింఛన్ల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కలుగుతుందని, వారి జీవనానికి కొంతమేర ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని అన్నారు. నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి భరోసా ఇందిరమ్మ భీమా

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా అల్మాస్‌గూడలోని వార్డు కార్యాలయాన్ని ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాలకు పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డు లేనివారు కూడా నిర్దేశించిన అర్హతలు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఈ మంచి అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎవరూ ఈ పథకం ప్రయోజనాలను కోల్పోకూడదని రాఘవేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ



కార్యక్రమంలో ఏ.ఇ హరీష్, వార్డ్ ఆఫీసర్ గీతా, ఆపరేటర్ హనుమత్, మణికంఠ, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లిలో ఇందిరమ్మ బీమా దరఖాస్తులకు వార్డుల వారీగా షెడ్యూల్ విడుదల

**ప్రజలు భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.. కమిషనర్ మురళీకృష్ణ**



**రామకృష్ణాపూర్ నవంబర్ 21 (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణకు క్యాతనపల్లి పురపాలక సంఘం వార్డుల వారీగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. పట్టణంలోని 22 వార్డుల్లో ఈ నెల 21 నుంచి డిసెంబర్ 14 వరకు విడతల వారీగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్. మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్ణయించిన వేదికల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఐదో వార్డులో నవంబర్ 21 నుంచి 25 వరకు, 1, 7, 11, 13వ వార్డుల్లో నవంబర్ 23 నుంచి 25 వరకు కార్యక్రమం నిర్వహిస్తారు. 2, 4, 8, 12, 14వ వార్డుల్లో నవంబర్ 26 నుంచి 29 వరకు, 3, 6, 10, 15వ వార్డుల్లో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.అలాగే 9వ వార్డులో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 5 వరకు, 16, 18, 20వ వార్డుల్లో డిసెంబర్ 4 నుంచి 7 వరకు, 17, 21వ వార్డుల్లో డిసెంబర్ 8 నుంచి 11 వరకు, 19, 22వ వార్డుల్లో డిసెంబర్ 12 నుంచి 14 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుంది.ప్రజలు తమ వార్డుకు కేటాయించిన తేదీలు, వేదికలను గమనించి నిర్దిష్ట సమయంలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మురళీకృష్ణ సూచించారు. ఇతర వివరాల కోసం సంబంధిత వార్డు అధికారులను సంప్రదించాలని కోరారు.

## ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కె నర్సింలును సన్మానించిన చైర్మన్ భీంరెడ్డి



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల ఇప్పాయిపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కురుంపల్లి నర్సింలును పి ఎస్ సి ఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్ ఘనంగా సన్మానించారు. కుల్కచర్ల మండలంలోని ఉపాధి హామీ పథకంలో ఇప్పాయిపల్లి గ్రామంలోని ఎక్కువ పనులు చేయించడం జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించడం సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించడం జరిగింది. కుల్కచర్ల మండలంలో ఎక్కడ ఉపాధి హామీ పనులు లేకున్నా కానీ ఇప్పాయిపల్లిలోని అందరికీ పని కల్పించండం సంతోషకరమైన విషయమని ఎల్ నినో ప్రభావం వల్ల నీటిని పొదుపుగా వాడుకోవాలని మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్ ప్రజలకు సూచించారు. ఎల్ నినో ప్రభావం ఉండడంవల్ల గ్రామాలలో ఎంతోమంది ఉపాధి లేక పట్టణాలకు వలస వెళ్లకుండా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 125 పని దినాలు కల్పించిందని అందుకే ప్రతి ఒక్కరూ పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్, ఉప సర్పంచ్ వడ్డె లక్ష్మి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొలుసని బాల్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు అమృతయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోగు వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రామచంద్రయ్య, బోయిని కృష్ణ,ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ అధ్యక్షులు నీల రాఘవేందర్, వార్డు సభ్యులు వెన్నచేటి ఆంజనేయులు, కామారం అంజిలయ్య, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.